Regd : No H. 634 Andhra Janatha Hyderabad 4 పేజీలు 7 నయాపైసలు

ఆంధ్రజనత
చందా వివరాలు
సంవత్సరం రూ. 27–00
6 నెలలు రూ. 14–00
3 నెలలు రూ. 7–00
మూడు నెలలకు తక్కువ చందా స్వీకరించబడదు
వివరాలకు:
మేనేజర్.
ఆంధ్ర జనత
గాంధీ భవనం హైదరాబాదు.

ఆంధ్రజనత

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

సంపుటి 5 హైదరాబాద్, మంగళవారం 1-9-1950 సంచిక 68

నగరానికి బర్మా వాణిజ్య ప్రతినిధి వర్గం రాక

హైదరాబాద్, ఆగస్టు 31

బర్మా వాణిజ్య ప్రతినిధి వర్గం హైదరాబాద్ వచ్చారు.

ఉభయ దేశాల మధ్య వాణిజ్యం పెంపొందించే అవకాశాల పరిశీలన కోసం ప్రతినిధి వర్గ సభ్యులు ఇండియా పర్యటన జరుపుతున్నారు. ప్రతినిధులు నేడు లఘు పరిశ్రమల మంత్రి శ్రీ భాగవంతరావు గారిని, వాణిజ్య మండలి సభ్యులను కలుసుకొన్నారు. రేపు వీరు మద్రాసు వెళతారు.

దేశ రక్షణకు దృఢ చర్చలు, చర్యలద్వారా పరిష్కారానికి కృషి

భారత ప్రభుత్వం అనుసరించ దలచిన విధానంపై నెహ్రూ వివరణ

నూతన ఆహార విధానం

జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో నిర్ణయిస్తారట

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఆహార విధానానికి సంబంధించిన వివిధ విషయాలు (స్వల్ప, దీర్ఘకాల ప్రయోజనాలకు సంబంధించినవి) జాతీయ అభివృద్ధిమండలి సమావేశంలో చర్చకు రాగలవని, ఈ సమావేశానికి రాష్ట్ర ఆహార మంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ ఎస్. కే. పాటిల్ నేడు రాజ్య సభలో వెల్లడించారు.

జాతీయ అభివృద్ధి మండలి సెప్టెంబర్ 5,6 తేదీలలో సమావేశాలు జరుపుతుంది.

రాష్ట్రాల సహకారంతో కేంద్రం తన కొత్త ఆహార విధానాన్ని రూపొందించ దలచుకొన్నదనీ, ఏమైనప్పటికీ తాత్కాలిక విధానాన్ని త్వరగా రూపొందించటం అత్యవసరమని శ్రీ పాటిల్ అన్నారు. తాత్కాలిక విధానాన్ని రూపొందించినట్లయితే, శాశ్వత విధానానికి పునాది ఏర్పడగలదని ఆయన అన్నారు.

ఆహార సమస్యను రాజకీయాలతో ముడిపెట్ట రాదనీ, ఈ విషయంలో అఖిల పక్ష దృక్పథాన్ని ఏర్పరచుకోవాలని ఆయన అన్నారు.

సరిహద్దు సంఘటనలపై రాజ్యసభలో ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఆగస్టు 26వ తేదీన చైనా సైనికులు లాంగ్జూ కాపలా కేంద్రాన్ని ముట్టడించిన సమయంలో అక్కడినుంచి తప్పుకొన్న భారత పోలీసులు మధ్యధారిలో "గాలెన్"అనే ప్రాంతం వద్ద వేరే ఒక కాపలా కేంద్రాన్ని స్థాపించారు.

లాంగ్జూ కాపలా కేంద్రానికి చెందిన భారత పోలీసులలో ఇద్దరిని కలుసుకోగా వారినుంచి, భారత ప్రభుత్వానికి అందిన తాజా సమాచారాన్ని బట్టి పై విషయం తెలియ వచ్చినది.

రాజ్యసభలో నేడు శ్రీ దివాన్ చమన్ లాల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రధాని నెహ్రూ పై వివరాలను తెలియ జేశారు. "దీన్నిబట్టి చూస్తే చైనా సైనికులు లాంగ్జూ కేంద్రాన్ని ఆక్రమించుకున్నదీ, లేక ఆదరిదాపుల్లో తిరుగాడు తున్నదీ స్పష్టంగా తేలటం లేదని" ఆయన అన్నారు. భారత భూభాగంలో చైనా సైనికుల అక్రమ ప్రవేశాన్ని నిరోధించటానికి భారత ప్రభుత్వం ఎటువంటి చర్యలు గైకొంటున్నదీ తెలియజేయాలని సభ్యులు అనేక మంది ప్రశ్నించగా "సైనిక చర్యలు, లేక ఇతర చర్యలను గూర్చి సభవారికి తెలియజేయటం తనకి సంభవం కాదని" శ్రీ నెహ్రూ అన్నారు.

ఇంకోవిధంగా చెప్పాలంటే దాదాపు 2 వేల మైళ్ళదాకా విస్తరించుకొని ఉన్న మన సరిహద్దుల్లో అక్రమ ప్రవేశాలను నిరోధించటం చాలా కష్టమైన విషయమే. అయితే అక్రమ ప్రవేశాలను అరికట్టటానికి, లేదా ఘన రక్షణ ఏర్పాట్లను కట్టుదిట్టం చేయటానికి విషయంలో కొన్ని చర్యలు తీసుకోటానికి అవకాశం ఉన్నదని శ్రీ నెహ్రూ అన్నారు.

శ్రీ నెహ్రూ ఇంకా ఇలా అన్నారు "దేశ సరిహద్దులను రక్షించుకొని తద్వారా భారత భూభాగాన్ని కాపాడుకోవటం మన విధి. అయితే పెద్ద దేశాల విషయంలో వారికీ, మనకీ ఏదో యుద్ధం వచ్చినట్టు హఠాత్తుగా ఎవరూ అరుపులు,

(మిగతా 4వ పేజీలో)

చెన్నారెడ్డి వర్గం నిష్క్రమణ సన్నాహాలు

హైదరాబాద్, ఆగస్టు 31

రాష్ట్ర సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీలో సభ్యులుగా ఉంటున్న మూడో డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు స్వతంత్ర పార్టీ పట్ల తమ వైఖరిని నిర్ణయించుకొనటానికి గాను సెప్టెంబర్ 14,15 తేదీలలో సమావేశం కానున్నారు.

శ్రీ ఎమ్. చెన్నారెడ్డిగారి నాయకత్వాన తిరుగుబాటు కాంగ్రెస్ వాదులు ఏర్పాటు చేసుకొన్న డెమోక్రాటిక్ పార్టీ, శ్రీ పి. వి. జి. రాజుగారి వర్గం కలిసి సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీగా అవతరించిన విషయం ఆంధ్రజనత పాఠకులకు విదితమే.

రాష్ట్ర అసెంబ్లీలో సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సభ్యులు 41 మంది ఉన్నారు. వారిలో 30 మంది పూర్వపు డెమోక్రాటిక్ పార్టీకి చెందిన వారు.

టిబెట్ సమస్యను ఇండియా సమితికి నివేదించటం

ప్రధాని నెహ్రూ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31

టిబెట్ సమస్యను భారత దేశం ఐక్యరాజ్యసమితికి నివేదించదని ప్రధాని శ్రీ నెహ్రూ నేడు ప్రకటించారు.

పాలం విమానాశ్రయంలో ఆస్ట్రేలియా విదేశాంగమంత్రికి స్వాగతం ఇవ్వటానికి వెళ్ళినప్పుడు ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా శ్రీ నెహ్రూ పై విషయాన్ని వెల్లడించారు.

టిబెట్ సమస్యను ఐక్యరాజ్య సమితికి నివేదించ దలచుకొన్నట్టు నిన్న దలైలామా ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

టిబెట్ సమస్యను ఐక్యరాజ్య సమితికి నివేదించరాదని స్వాతంత్ర్యం గా ఆయన వ్యాఖ్యానించారు.

చైనాకు సభ్యత్వంలేని ఐక్యరాజ్య సమితిలో టిబెట్ సమస్యను చర్చించటంవల్ల ప్రయోజనం లేదని ఆయన అన్నారు.

వార్డుకు ఒక చౌక ధాన్యం దుకాణం

నగర కార్పొరేషన్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 31

నగరంలోని 66 వార్డులలో వార్డు కొకటి వంతున చౌక ధాన్యం దుకాణాలను ప్రారంభించాలని హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నేటి సాయంత్రం నిర్ణయించినది.

సుమారు మూడు గంటలసేపు స్థాయీ సంఘం సమావేశంపై చర్చ జరిగినది.

మేయర్ శ్రీ రోషన్ అలీఖాన్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రభుత్వం రూపాయికి రెండున్నర శేర్లయినా ఇస్తామని పట్టుంలో రెండు నెలల పాటు చౌకదుకాణాలను నిర్వహించటంవల్ల ప్రయోజనంలేదని స్థాయీ సంఘం అభిప్రాయం ప్రకటించినది.

నెలకు 150 రూపాయలలోపు ఆదాయం కలవారికిమట్టుకు చౌక దుకా

(మిగతా 4 వ పేజీలో)

రైలు ప్రమాదంలో 14 మందికి గాయాలు

బొంబాయి, ఆగస్టు 31

మన్మాడ్ నుండి థోండ్ మీదుగా పూనా పట్టణానికి వెడుతున్న ఒక ప్యాసింజర్ బండి నేడు ఉదయం 9-35 గంటలకు విసాపూర్, బెల్వాండే స్టేషన్ల మధ్య పట్టాలు తప్పిన ఫలితంగా 14 మంది (వారిలో తీవ్రంగా) గాయపడ్డారని అధికార వర్గాల ద్వారా తెలియ వచ్చినది.

ఇంజన్, ఆరు బోగీలు పూర్తిగా పట్టాలు తప్పినవి. ఏడవ బోగీ సగం క్రింద, సగం పట్టాల మీద ఉన్నది.

తీవ్రంగా గాయపడిన వారిలో ఒకరు ఇంజన్ ఫైర్‌మన్, గాయపడినవారిలో అరుగురు రైల్వే పనివారు. మిగతా అరుగురు ప్రయాణీకులు.

గాయపడిన వారికి ప్రమాద స్థలం వద్ద వెంటనే చికిత్స జరిగింది.

హైదరాబాద్ డిప్యూటీ మేయర్

శ్రీ ఎమ్. బాబూరావు ఎన్నిక

హైదరాబాద్, ఆగస్టు 31

హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నేడు అస్సాం గవర్నర్ శ్రీ ఫజల్ అలీ మరణంపట్ల సంతాపాన్ని ప్రకటించినది.

ఇటీవల అధిక వర్షాలవల్ల నగరంలో చనిపోయినవారి కుటుంబాలకు కూడా కార్పొరేషన్ తన సానుభూతి తెలిపింది.

డిప్యూటీమేయర్ పదవికి రాజీనామా సమర్పించిన శ్రీ యాదగిరిరావు స్థానే ఆ పదవికి కాంగ్రెస్ (హరిజన) సభ్యుడు శ్రీ ఎమ్. బాబూరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

నెహ్రూతో ఆఫ్ఘనిస్తాన్ మంత్రి సంభాషణలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31

ఢిల్లీ మీదుగా పెకింగ్ వెడుతున్న ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి సర్దార్ మహమ్మద్ నైమ్ నేడు మధ్యాహ్నం ప్రధాని నెహ్రూను కలుసుకొని, ఆయనతో ఒక గంటసేపు సంభాషణ జరిపారు.

ఆ తర్వాత ప్రధాని నెహ్రూ స్వయంగా విమానాశ్రయానికి వచ్చి, సర్దార్ నైమ్‌కు వీడ్కోలు ఇచ్చారు.

దలైలామాకు మెగసేసే ఎవార్డు

మనీలా, ఆగస్టు 31

సమాజ నాయకత్వానికిగాను లభించిన మెగసేసే ఎవార్డును దలైలామా అంగీకరించారు.

దలైలామా పక్షాన ఆయన సోదరుడు గ్యాలో థొండప్ ఎవార్డును స్వీకరించారు.

చైనా అఘాయిత్యాలపై బ్రిటిష్ ప్రధానితో ఐసెన్‌హోవర్ చర్చలు

లండన్, ఆగస్టు 31

భారత భూభాగంపై చైనా దురాక్రమణలను గూర్చి బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్, అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నిన్నటిదినం సమావేశంలో చర్చలు జరపినట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తున్నది.

ఉభయ నాయకులు ఇండియా, చైనా సరిహద్దు పరిస్థితిని గూర్చి చర్చించినట్లు పై వర్గాలవారు అన్నారు. సమావేశం బకింగ్‌హామ్ పైలోని బ్రిటిష్ ప్రధాని గ్రామీణ వసతి గృహంలో (చర్చిల్ భవనం) జరిగినది.

అణ్వాస్త్ర పరీక్షలకు సంబంధించిన సమస్యలతోపాటు రక్షణ విషయాలపై కూడా ఉభయ నాయకులు చర్చలు జరిపారు.

మళ్ళీ రెండు చోట్ల చైనా దురాక్రమణ

షిల్లాంగ్, ఆగస్టు 31

"నేఫా" ప్రాంతంలోని సియాంగ్, లోహిత్ డివిజన్‌ల లో చైనా సైనికులు కొత్తగా మరికొన్నిచోట్ల దురాక్రమణ సాగించినట్టు నేడు ఇక్కడికి వార్తలు జేరినవి.

మన్ మోహన్ సరిహద్దు తేఖకు బ్లాగా షమీపంలో ఉన్న భారత కాపలా కేంద్రాలు చైనా సైనికుల రద్దీ ఎక్కువ కావటంతో అవి మనచేతుల్లోంచి తప్పిపోయినట్టు కూడా ఆ వార్తలు తెలుపుతున్నవి.

ఆగస్టు 26వ తేదీన చైనా సైనికులు అక్రమించిన లాంగ్జూ కాపలా కేంద్రం పరిస్థితి ఏవిధంగా ఉన్నదీ స్పష్టంగా తెలియటంలేదు.

కొత్తగా దురాక్రమణ జరిగినట్టు వినవచ్చిన వార్తలను గూర్చి విలేఖరులు ప్రశ్నించగా "నేఫా" అధికారులు వాటినిగూర్చి మాట్లాడటానికి నిరాకరించారు.

టిబెట్‌లో ఇంకా పోరాటం సాగుతున్నదట

న్యూఢిల్లీ, ఆగస్టు 30

అంతర్జాతీయ జ్యూరిస్టుల కమిషన్ నియమించిన టిబెట్ న్యాయ విచారణ సంఘం అధ్యక్షుడు శ్రీ పురుషోత్తం త్రికందాస్ నేడు ముస్సోరీలో దలైలామాను కలుసుకొన్నారు.

టిబెట్‌లో చైనావారు ఇంకా తిరుగుబాటును అణచి వేయటానికి ప్రయత్నాలు సాగిస్తున్నారనీ, కంపాలు ఇంకా పోరాడుతునే ఉన్నారని దలైలామా అన్నట్టు శ్రీ త్రికందాస్ వెల్లడించారు.

దలైలామాకు ఇప్పటికీ ఎప్పటికప్పుడు టిబెట్ నుంచి వార్తలు వస్తున్నవనీ, అక్కడ జరుగుతున్న సంఘటనలు ఆయనకు ఆందోళన కలిగిస్తున్నవని శ్రీ త్రికందాస్ అన్నారు.

ఈతకై వెళ్ళి గోదావరిలో మరణం

భద్రాచలం పట్ట దుస్సంఘటన

హైదరాబాద్, ఆగస్టు 31

భద్రాచలం సబ్ కలెక్టర్ ఆఫీసులో గుమస్తాగా పని చేస్తున్న ఎస్. వెంకటేశ్వర్లు అనే 30 సంవత్సరాల యువకుడు ఈ నెల 29 వ తేదీన గోదావరిలో ఈత కొడుతుండగా ప్రవాహం లో కొట్టుకు పోయినట్టు నేడు భోపిసు కేంద్ర కార్యాలయానికి ఒక వార్త అందినది. వెంకటేశ్వర్లు చనిపోయి ఉంటాడని అనుకుంటున్నారు. అతని దేహం దొరకలేదు.

టిబెట్‌లో చైనా ఘాతుక చర్యలు

దలైలామా నిర్ణయానికి ఇవి కారణం

ముస్సోరీ, ఆగస్టు 31

కాగుంగ్ ఎలు ఒక వారం రోజులు చర్చించ నిదటనే దలైలామా టిబెట్ సమస్యను ఐక్యరాజ్య సమితికి నివేదించాలని నిర్ణయించినట్టు నేడిక్కడ తెలియ వచ్చినది.

బౌద్ధ మఠాల నుంచి బుద్ధదేవుని విగ్రహాలను తీసివేయటం, విలువైన బౌద్ధ గ్రంథాలను తగుల పెట్టటం, పెద్ద పెద్ద భవనాలను కూలగొట్టడం, టిబెట్ జాతిని సమూలంగా నాశనం చేయటానికాను బిడ్డలు పుట్టరుండా కంపాల [illegible] అవలంబించటం, [illegible] చర్యలను చైనావారు భారీ ఎత్తున సాగిస్తున్నారని అక్కడి నుంచి వస్తున్న వార్తల దృష్ట్యా దలైలామా పై నిర్ణయాన్ని గైకొన్నట్టు టిబెట్ వర్గంవారు వివరించారు.

భూటాన్ ప్రభుత్వ సలహాదారుడు శ్రీ డి. కె. సేన్ మొన్న శనివారం నాడు దలైలామాను, ఆయన మంత్రులను కలుసుకొని, వారితో సుదీర్ఘ సంభాషణలు జరిపారు.

ఐక్యరాజ్య సమితిలో భారతదేశమే

(మిగతా 4వ పేజీలో)

త్రివేండ్రం సమీప గ్రామంలో ఘర్షణ

18 మందికి గాయాలు

త్రివేండ్రం, ఆగస్టు 31

నిన్న రాత్రి ఇక్కడకు సమీపంలోని గ్రామంలో మాజీ ముఖ్య మంత్రి శ్రీ సంబూద్రిపాద్ గౌరవార్థం ఏర్పాటు చేయబడిన ఒక సన్మాన సభలో రెండు వర్గాలు ఒకరిపై మరొకరు రాళ్లు విసురుకొన్న ఫలితంగా ఎనిమిది మంది గాయపడ్డారు.

ఇక్కడకు 12 మైళ్ల దూరం లోని నెహట్టింకారా గ్రామంలో ఈ సంఘటన జరిగినది.

సభ ప్రారంభం కావటానికి ముందు ఒక పెద్ద ఊరేగింపు సభాస్థలికి రావటంతో అల్లరి ప్రారంభమైనది.

కమ్యూనిస్టులమని చెప్పుకొన్న ముగ్గురు వ్యక్తులు తమకు సంఘటనలో కత్తిపోటు గాయాలు తగిలాయని ఫిర్యాదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

పై వ్యక్తులను ఆస్పత్రిలో చేర్చారు.

ధవళేశ్వరం వద్ద వరద మట్టం

హైదరాబాదు, ఆగస్టు 31

నేడు సాయంత్రం అందిన తాజా వార్తల ప్రకారం ధవళేశ్వరం వద్ద వరద నీటిమట్టం 14.3 అడుగులు, కూనవరం వద్ద 50.4 అడుగులు ఉన్నది. భద్రాచలం వద్ద నీటి మట్టం 53.7 అడుగులున్నదనీ, వరద తగ్గుతున్నదనీ తెలుస్తున్నది.

కలకత్తాలో ప్రదర్శకులపై బాష్పవాయు ప్రయోగం

కలకత్తా, ఆగస్టు 31

నేడు ఇక్కడ పోలీసు నిర్బంధాలను తప్పించుకొని డల్హౌసీ స్క్వేర్‌లో ప్రవేశించటానికి ప్రయత్నించిన ప్రదర్శకులపై పోలీసులు లాఠీ, బాష్పవాయు ప్రయోగాలు చేసారు.

ఆహార సమస్యపై ఆందోళన సందర్భంగా మైదానం వద్ద చేరిన 25 వేల మంది ప్రదర్శకులలో కొంతమంది పై విధంగా డల్హౌసీ స్క్వేర్‌లో ప్రవేశించటానికి ప్రయత్నించారు. రైటర్స్‌బిల్డింగ్ వద్దకు వెళ్లాలని మొదట ప్రదర్శకులు కార్యక్రమం పెట్టుకొన్నారు.

డల్హౌసీ స్క్వేర్‌లో ప్రదర్శకులు కనిపించిన వోటల్లా లాఠీలు ప్రయోగించి పోలీసులు జనాన్ని చెదరగొట్టారు. రైటర్స్ బిల్డింగ్ వద్ద, రోడ్డు ప్రక్కల గుమి కూడిన జనాన్ని చెదరగొట్టటానికి గాను పోలీసులు పెక్కుసార్లు బాష్పవాయువును ప్రయోగించారు.

నేడు రాత్రి 7 గంటలకు పై సంఘటన జరిగినది.

నేటి మధ్యాహ్నం అలిపూర్ ప్రాంతంలో పోలీసులు నూరుమంది ప్రదర్శకులను అరెస్టు చేసారు.

నగరానికి ఉదయం నుంచి అనేక చోట్ల ప్రదర్శకులు వచ్చారు. నగరానికి వచ్చే అన్ని మార్గాలలోనూ పోలీసులు కట్టుదిట్టాలు చేసి ప్రదర్శకులను నిరోధించారు. నిన్న రాత్రి నుంచి పై ఏర్పాట్లు జరిగాయి.

జూమ నివారణ సంఘం ఆదేశాల ప్రకారం పై ప్రదర్శనలు జరిగాయి.

న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, ఆగస్టు 31

నేటి ప్రారంభ ధర	32.34
నేటి ముగింపు ధర	32.32

మరణించిన టిబెట్ న్యాయ విచారణ సంఘం అధ్యక్షుడు

టిబెట్ న్యాయ విచారణ సంఘం అధ్యక్షుడు శ్రీ పురుషోత్తం త్రికందాస్ నేడు ముస్సోరీలో దలైలామాను కలుసుకొన్నారు.

టిబెట్‌లో చైనావారు ఇంకా తిరుగుబాటును అణచి వేయటానికి ప్రయత్నాలు సాగిస్తున్నారనీ, కంపాలు ఇంకా పోరాడుతునే ఉన్నారని దలైలామా అన్నట్టు శ్రీ త్రికందాస్ వెల్లడించారు.

దలైలామాకు ఇప్పటికీ ఎప్పటికప్పుడు టిబెట్ నుంచి వార్తలు వస్తున్నవనీ, అక్కడ జరుగుతున్న సంఘటనలు ఆయనకు ఆందోళన కలిగిస్తున్నవని శ్రీ త్రికందాస్ అన్నారు.

అలహాబాద్ కాల్పులపై న్యాయవిచారణ

లక్నో, ఆగస్టు 30

అలహాబాద్‌లో మొన్న ఆగస్టు 28 వ తేదీన జరిగిన పోలీసు కాల్పుల విషయాన్ని విచారించటానికి గాను అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ వశిష్ట భార్గవాను ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నియమించినది.

భారత భూభాగంలో చైనీస్ నిర్మించిన రోడ్డు

బాంబులతో పేల్చివేయాలనే సూచనకు ప్రధాని నెహ్రూ తిరస్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 31

చైనావారు నిర్మించిన యాఫింగ్-గర్పాక్ రోడ్డును, అది భారతభూభాగంలోకి ప్రవేశించినంత మేరకు బాంబులతో పేల్చివేయాలని రాజ్యసభలో నేడు ఒక ప్రతిపక్ష సభ్యుడు చేసిన సూచనను ప్రధాని నెహ్రూ తిరస్కరించారు. (పైన పేర్కొన్న రోడ్డు లడక్ వద్ద భారత భూభాగంలో కొంత వరకు ప్రవేశించినది.)

భారత ప్రభుత్వం అటువంటి విధానాన్ని అవలంబించ లేదని ఆయన అన్నారు. తనవైపు రుజువులు ఎక్కువగా ఉండడం వల్ల భారతప్రభుత్వం ఆభాగం తనదేనని ప్రకటించినది. అయితే చైనావారు కూడా కొన్నిపటాలను చూపిస్తూ అది తమ భాగమే అని అన్నారు. పటాలు బాగా పాతవే. అవి పాతికి తగినరుజువు ఇస్తున్నాయి.

కాబట్టి ఇటువంటి విషయాలు సంప్రతింపుల ద్వారా, ఒక అవగాహనకు రావటం ద్వారా పరిష్కరించు కోవాలని శ్రీ నెహ్రూ అన్నారు.

"ఇవన్ని ఆయుధాలు అవలంబించకుండా ఇటువంటి విషయాలపై దేశాలు యుద్ధానికి దిగవు; దిగకూడదు" అని అన్నారు శ్రీ నెహ్రూ.

ప్రకటన

హిందుస్తాన్ జనరల్ ఇన్‌స్యూరెన్స్ సొసైటీ లిమిటెడ్

ఇచ్చాపూర్వకంగా వెళ్ళిపోయిన శ్రీ బి. వి. తెల్లిచెర్రి, స్థానే హైదరాబాద్ బ్రాంచ్ సెక్రటరీగా శ్రీ కమలాకర్ షిండే, బి. ఏ. నియమితులైనారు.

(సం) ఎమ్. జె. దాస్లే
డివిజనల్ సెక్రటరీ

వికారి నామ సంవత్సరం
మంగళవారం, సెప్టెంబర్ 1, 1959
శ్రావణ బహుళ త్రయోదశి
త్రయోదశి ఉ॥ 7-57
ఆశ్లేష రా॥ 2-21
వర్జ్యం మ॥ 2-46 మొ॥ 4-15కు

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు: 4950

మంగళవారం, సెప్టెంబర్ 1, 1959

చైనా దురాక్రమణ—1

భారత సరిహద్దుల్లో కమ్యూనిస్టు చైనా జరిపిన దాడులు, దురాక్రమణలకు సంబంధించి పార్లమెంట్‌లో ప్రధాని నెహ్రూ చేసిన ప్రకటన ప్రపంచం అంతటా పెద్ద సంచలనం కలిగించటంలో ఆశ్చర్యం లేదు.

కాని నిజంగా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రధాని నెహ్రూ భారత సరిహద్దుల్లో చైనా సాగిస్తున్న అఘాయిత్యాలను ఇంతవరకు ప్రజల దృష్టికి తీసుకొని రాకపోవటమే. చైనా సైనికులు మన యెల్లలు దాటిరావటం, మన భూభాగంపై పదేపదే దురాక్రమణ జరపటం, మన దళాలపై కాల్పులు జరపటం ఇత్యాది చర్యలు గత రెండు సంవత్సరాలుగా జరుగుతున్నవి. లడక్‌లో కొంత ప్రాంతాన్ని చైనా వారు అక్రమించుకొన్నట్టు వార్తలు వచ్చినవి. "నేఫా" ప్రాంతంలో ఈ నెల జరిగిన సంఘటనలు మరీ ధారుణంగా ఉన్నవి. ఈ ప్రాంతంలో చైనా సేనలు బలప్రయోగం ద్వారా మన కాపలా కేంద్రాన్ని వశపరచుకొన్నవి. మరొకచోట భారత కాపలా దళం వారిని వెనక్కి నెట్టివేసారు. ఈ దురాక్రమణ చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు ప్రపంచం దృష్టికి తెచ్చినట్లయితే, పరిస్థితి ఇంతవరకు వచ్చిఉండేది కాదనటానికి ఆస్కారం లేకపోలేదు.

కమ్యూనిస్టు చైనా ఈ విధంగా భారత సరిహద్దులలో చిరుతలివలె స్వైర విహారం చేయటంలో ఉద్దేశం ఏమిటో అర్థం కావటంలేదని ప్రధాని నెహ్రూ అన్నారు. అయితే, ఈ సందర్భంలో మనం కొన్ని ముఖ్య విషయాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. భారత ప్రభుత్వం ఎన్నిసార్లు అధిక్షేపణ తెలిపినప్పటికీ, వాటిని లెక్క చెయ్యకుండా భారత భూభాగాలను చైనా భూభాగాలుగా చిత్రిస్తున్న పటాలను పెకింగ్ ప్రభుత్వం ప్రచారం చేస్తూనే ఉన్నది. టిబెట్‌పై జరిగిన దురాక్రమణను ఇండియా ఖండించినందుకు, టిబెట్ ప్రజల పట్ల సానుభూతి చూపినందుకు, దలైలామాతో సహా వేలాది టిబెట్ శరణార్థులకు భారత దేశంలో ఆశ్రయం ఇచ్చినందుకు చైనా చాలా ఆగ్రహం చెందింది. తన కీర్తి సామ్రాజ్యాన్ని, భౌగోళిక సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలని కమ్యూనిస్టు చైనా తీవ్రంగా కాంక్షిస్తున్న దనటంలో సందేహం లేదు. టిబెట్‌ను కబళించటం, ఆ తర్వాత అక్కడ బయలుదేరిన ప్రజల తిరుగుబాటును అణచివేయటం, టిబెట్ సంస్కృతిని నాశనం చెయ్యటానికి పూనుకొనటం గుర్తించకూడా ఆయన వెంట వెడతారు. సామ్రాజ్య తత్వాన్నే సూచిస్తున్నవి. లడక్, భూటాన్, సిక్కిం, నేపాల్ చైనా వారి "మాతృభూమి"లో అంతర్భాగాలేనని, వాటిని "విముక్తి" చెయ్యాలని చైనా అధికార వర్గాల ద్వారా ఉధృతంగా ప్రచారం జరగటాన్ని బట్టి చూస్తే, వీటిని కూడా తన సామ్రాజ్య కాంక్షకు యెర చేసుకోవాలని చైనా నిశ్చయించుకొన్నట్టు అనుమానించక తప్పదు. అర్థిక రంగంలో సాధించిన విజయాల ద్వారా హిమాలయ రాజ్యాలను తనవైపు ఆకర్షించుకోగలనని చైనా ఆశించింది. కాని ఇటీవల చైనా ఆర్థిక అభివృద్ధి ప్రయత్నాలు తారుమారైనవి. అనేక రంగాలలో పరిస్థితులు చుక్కెదురు కావటం వల్ల చైనా తన భౌతిక లక్ష్యాలను తీవ్రంగా తగ్గించ వలసి వచ్చింది. కమ్యూన్లు కూడా అనుకొన్నరీతిగా పని చెయ్యటంలేదని వార్తలు వస్తున్నవి. దానితో కీర్తిసామ్రాజ్య విస్తరణ వాంఛ తీవ్రంగా దెబ్బతిన్నట్టు పెకింగ్ భావించి ఉండవచ్చును. పైగా, భూటాన్ మున్నగు రాజ్యాలు పెకింగ్ వైపు ఆకర్షింపబడటానికి బదులు, ఆ దేశం అంటే భయపడుతున్నవి. ఇండియా రక్షణను అర్థిస్తున్నవి. ఈ విధంగా ఇండియా పై ఆధారపడి ప్రయోజనం లేదని వాటిని హెచ్చరించటమే "నేఫా" ప్రాంతంలో సైనిక బలాన్ని ప్రదర్శించటంలోను, దురాక్రమణలు జరపటంలోను కమ్యూనిస్టు చైనా ఉద్దేశమై ఉండాలి. కాని ఇది మూర్ఖత్వం తప్ప వేరొకటి కాదు. కమ్యూనిస్టు చైనా అంటే పైన రాజ్యాలలో భయం ఎక్కువై, ఆ దేశం ఇప్పుడొక బ్రహ్మరాక్షసి వలె కనిపిస్తున్నది.

బ్రిటిష్ లేబర్ పార్టీ నాయకుల రష్యా పర్యటన

మాస్కో, ఆగస్టు 29

బ్రిటిష్ లేబర్ పక్షం నాయకులు శ్రీ హగ్‌గైట్‌స్కెల్, శ్రీ అవూరిస్ లెవాన్ పది రోజుల పర్యటన నిమిత్తం నేటి రాత్రి మాస్కో చేరారు.

సోవియట్ ఇంటర్ పార్లమెంటరీ గ్రూప్ ఆహ్వానాన్ని పురస్కరించుకుని లేబర్ నాయకులు సోవియట్ పర్యటనకు వచ్చారు.

గ్రూప్ ఉపాధ్యక్షుడు శ్రీ అలెగ్జాండర్ హోల్కోవ్ లేబర్ నాయకులకు స్వాగతమిచ్చారు.

వాషింగ్టన్‌లో చర్చలకోసం యాల్టాలో "బలాన్ని కూడగట్టుకొంటున్న" ప్రధాని కృశ్చేవ్‌తో వీరు సమావేశం కాగలరని తెలుస్తున్నది.

శ్రీ పాటస్కర్ అస్వస్థత

భోపాల్, ఆగస్టు 30.

మధ్య ప్రదేశ్ గవర్నర్ శ్రీ పాటస్కర్ అస్వస్థులుగా ఉన్నందు వల్ల ఆయన తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొన్నారు.

శ్రీ పటాస్కర్‌కు కొద్ది రోజుల బట్టి జ్వరం తగులుతున్నదనీ, ఆయనకు పూర్తి విశ్రాంతి అవసరమనీ డాక్టర్ ప్రకటించారు.

చక్కెర సమస్య
జమ్మూలో ప్రదర్శనలు

జమ్మూ, ఆగస్టు 31

చక్కెర విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంపట్ల నిరసనగా 400 మంది ప్రజా పరిషత్తు కార్యకర్తలు నిన్నటిదినం ఇక్కడ ప్రదర్శనలు జరిపారు. తర్వాత ఒక బహిరంగ సభ జరిపి చక్కెర సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేక పోతున్నదని విమర్శించారు.

లండన్, ఆగస్టు 29

ప్రధాని నెహ్రూ ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాలు పర్యటించేటప్పుడు, కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా గాంధీకూడా ఆయన వెంట వెడతారు.

టిబెట్ సమస్య:

భద్రతా మండలిలో చర్చకు వచ్చే అవకాశం

ఐక్యరాజ్యసమితి, (న్యూయార్కు) ఆగస్టు 31

టిబెట్ సమస్యను గూర్చి చర్చించటానికి గాను భద్రతా మండలి సమావేశం కావలసినదిగా కోరటం జరుగ వచ్చునని దౌత్య వర్గాల వారు నేడు ఇక్కడ అన్నారు.

టిబెట్ సమస్యను ఐక్యరాజ్య సమితి సమర్పించటానికి నిర్ణయించినట్టు దలైలామా నిన్నటిదినం చేసిన ప్రకటన ప్రభావం ఇది జరుగవచ్చునని వారు అన్నారు.

అయితే 82 మంది సభ్య రాజ్యాలవారలో ఎవరైనా టిబెట్ సమస్యను సమితిలో ప్రవేశపెట్టటానికి సిద్ధపడుతున్నట్టు ప్రస్తుతానికి ఎక్కడా సూచనలు కానరాటం లేదు.

సమితిలో టిబెట్‌కు సభ్యత్వం లేదు కనుక భద్రతా మండలిలో సమస్యను ప్రతిపాదించటానికి మరో దేశంమీద ఆధారపడాలి. సభ్యులలో ఎవరైనా భద్రతామండలి సమావేశం కావాలని కోరినట్టయితే అది తృణీకరించ బడకపోవచ్చునని అంటున్నారు.

అటువంటి పరిస్థితుల్లో ఇండియా ఛేయబోయే ఏ ఫిర్యాదులైనా తన ఫిర్యాదు కూడా జోడించబడటం జరుగవచ్చునని దలైలామా ఆశించవచ్చు.

తన దేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రపంచ దృష్టికి తేవటానికి మాత్రమే దలైలామా నిన్న ఆ విధంగా ప్రకటన చేసి ఉండ వచ్చునని సమితి ప్రతినిధులు కొందరు అన్నారు. భద్రతా మండలిలో టిబెట్ సమస్య పరిపూర్ణంగా చర్చించ బడాలని కూడా దలైలామా ప్రస్తుతానికి వాంఛించటం లేదని మరికొందరు ప్రతినిధులు అన్నారు.

దలైలామా నిర్ణయం
సమితికి ఇంకా వర్తమానం అందలేదట

ఐక్యరాజ్య సమితి, ఆగస్టు 30

టిబెట్ సమస్యను ఐక్యరాజ్య సమితికి సమర్పించాలని దలైలామా చేసిన నిర్ణయానికి సంబంధించి తమకేమీ వర్తమానం ఇంకా అందలేదని ఐక్యరాజ్య సమితి అధికారులు నేడు ఇక్కడ అన్నారు.

దలైలామా ఐక్యరాజ్య సమితి నిర్దిష్టంగా ఒక చర్య తీసుకోవాలని కోరుతున్నాడో, లేక ఆ విషయం ఇక్కడ చర్చించబడుతుందన్న ఆశతో తన దేశ పరిస్థితిని గూర్చి ఒక ప్రకటన చేయాలని అనుకొన్నాడో స్పష్టంగా తెలియటం లేదని వారు అన్నారు.

టిబెట్ ప్రజల అధినేతగా చట్టరీత్యా దలైలామా ప్రస్తుత స్థితి ఎటువంటిదీ అన్న విషయం కూడా స్పష్టం కావటం లేదనీ, ఐక్యరాజ్య సమితి సహాయాన్ని కోరే పక్షంలో దానికి సంబంధించిన ప్రతిపాదన మరోవర్గం నుంచి రావలసి ఉంటుందనీ ఒక అధికారి అన్నారు.

సమితి కార్యదర్శి హేమర్‌షెల్డ్ ప్రస్తుతం ఇక్కడ లేరు. దక్షిణ అమెరికాలో పర్యటిస్తున్నారు

సరిహద్దు సంఘటనలు
దేశ్‌ముఖ్ వ్యాఖ్య

మనిల్లా, ఆగస్టు 30

ఇండియా, చైనా సరిహద్దు సంఘటనలను 'పెద్ద తీవ్రమైన విషయంగా పరిగణించ కూడదని' యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ అధ్యక్షుడు శ్రీ చింతామణి దేశ్‌ముఖ్ నేటి దినం ఇక్కడ అన్నారు. మెగ్‌సేసే ఎవార్డును స్వీకరించటానికి గాను శ్రీ దేశ్‌ముఖ్ హాంకాంగ్ నుంచి నేడు ఇక్కడికి వచ్చారు.

ఉభయ దేశాల వారు పూర్తిగా ఆర్థిక అభివృద్ధి కార్యక్రమంలో మునిగి ఉన్నారు. కనుక ఇండియా, చైనాల మధ్య శాంతి కొనసాగుతుందనే తన విశ్వాసం అని ఆయన అన్నారు.

అలహాబాద్ జిల్లాలో విద్యార్థుల అల్లరు
తహసీల్‌దార్ కార్యాలయంపై దాడి

అలహాబాద్, ఆగస్టు 31

అలహాబాద్ జిల్లాలో కార్ఖనా అనే పట్టణంలోని కళాశాల విద్యార్థులు దాదాపు 700 మంది నిన్నటిదినం తహసీల్, థానా కార్యాలయాలపై దాడి జరిపి తలుపులు, కిటికీ అద్దాలు విధ్వంసం చేశారు.

నైనీ అనే ప్రాంతంలో కూడా దౌర్జన్యాలు జరిగాయి. 100మంది విద్యార్థులు ఒక బస్సును అటకాయించి అద్దాలు పగులగొట్టారు.

అలహాబాద్ నగరంలో మట్టుకు దౌర్జన్య చర్య లేమీ జరుగలేదు. 141వ సెక్షన్‌ను ఉల్లంఘించి కోశాంబీ చావిడివద్ద ఏడుగురు వ్యక్తులు మట్టుకు ప్రదర్శనలు జరిపారు.

చైనా దౌత్య కార్యాలయం ముందు ప్రదర్శనలు
దురాక్రమణపట్ల నిరసనగా

కలకత్తా, ఆగస్టు 31

భారత భూభాగంపై చైనా దురాక్రమణపట్ల నిరసన వెల్లడిస్తూ ఒక నివేదికను సమర్పించటానికిగాను 800మంది కాంగ్రెస్ కార్యకర్తలు నిన్నటిదినం ఇక్కడ చైనా దౌత్య కార్యాలయానికి పెద్ద ఊరేగింపుగా బైలుదేరి వెళ్ళారు.

అయితే ప్రదర్శకులను కాన్సులేట్ కార్యాలయానికి సమీపంగా పోలీసులు అటకాయించారు. పైగా కార్యాలయంలోపల ఆ సమయానికి చైనీస్ అధికారులు కూడా ఎవరూ లేరు. దానితో ప్రదర్శకులు తాము తీసుకువచ్చిన నివేదికను కార్యాలయం గోడలకి అంటించి వెళ్ళి పోయారు.

దీనికిముందు ప్రదర్శకులు కలకత్తా, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన పెద్ద బహిరంగసభ జరిపి చైనా దురాక్రమణను ఖండించారు.

తల్లిని రక్షించటానికి కుమారుడు ఆత్మత్యాగం

హైదరాబాద్, ఆగస్టు 31

తల్లిని రక్షించటానికి గాను పాలిబండలో మొన్నటి దినం సురేష్ బాబా గేకర్ అనే యువకుడు తన ప్రాణాలను ధారపోశాడు వర్షం మూలంగా నగరంలో గత ఒకటి రెండు రోజుల్లోను అనేక చోట్ల ఇళ్లు కూలిపోయిన విషయం అందరికీ తెలిసినదే. సురేష్ ఉంటున్న ఇల్లుకు కూడా అదే గతి పట్టి తల్లిని కాపాడటంలో అతడు కూడా క్రిందపడి చనిపోయాడు.

అర్థరాత్రి అంతా నిద్రపోతున్న సమయంలో ఇంటి నడి కప్పు విరిగి ఫెళాఫెళా క్రిందికి పడబోవటం సురేష్ విన్నాడు. నిద్రపోతున్న తల్లికి ఏం జరుగుతున్నదీ ఏమీ తెలియదు. సురేష్ గబగబా వెళ్లి ఆమెను రక్షించాడు. అయితే ఈలోగా నడి కప్పు పూర్తిగా కూలిపోయి దాని క్రింద అతడు చిక్కుకుపోయాడు.

పోలీసులు, ఇరుగు పొరుగు వారు వచ్చి అతన్ని బైటికి తీసి వెంటనే హాస్పటల్‌కు పంపించారు గాని సురేష్ బ్రతకలేదు; తెల్లవారే సరికి చనిపోయాడు.

సురేష్ మృతికి సంతాపసూచకంగా అతడు చదువుకుంటున్న వైదిక ధర్మ ప్రకాశక్ హైస్కూలు ఒకరోజు మూసివేయబడినది.

కొద్ది పెట్టుబడితో స్వంత పరిశ్రమలు ఏర్పరచుకొనే మార్గాలు
మద్రాసులో అమెరికన్ ప్రదర్శనం విశేషాలు

(అమెరికన్ లఘు పరిశ్రమల ప్రదర్శనానికి మద్రాసులో నేడే ప్రారంభోత్సవం జరుగుతుంది)

అమెరికన్ లఘు పరిశ్రమల ప్రదర్శనంలో ప్రధాన పారిశ్రామిక శాలలో (డేరాలో), అమెరికా పారిశ్రామికాభ్యుదయానికి చైతన్య శక్తిని చేకూర్చిన చిన్న తరహా పరికరాలు ఎన్నో ఉన్నవి ఈ డేరాలో సుమారు 82 అమెరికన్ పారిశ్రామిక సంస్థలు తయారు చేసిన చేతి పనిముట్లు "ప్రెసిషన్" పరికరాలు, యంత్రాలు ప్రదర్శిస్తున్నారు.

ఇంచుమించు ప్రతి పరిశ్రమలోనూ విరివిగా వినియోగించబడుతున్న వెల్డింగ్ పద్ధతిని ఆ డోము మధ్యలో ప్రదర్శిస్తారు. అక్కడ రెసిస్టెన్స్, గ్యాస్, ఆర్క్ వెల్డింగులు ఎలా చేసేదీ సోదాహరణంగా చూపిస్తారు.

ఆ యంత్రంతో మోటారుకార్లు ఎగ్జాస్టు సైలెన్సర్లు, మోటారు బాడీ రిపెయిర్లు, స్టీలు ట్రంకు పెట్టెలు, వాటర్ ట్యాంకులు, విరిగిపోయిన సామాన్లు, మోటారుకార్లు, ఎడ్లబళ్ళ ఇరుసులు, లోహపు రేకులను వెల్డ్ (అతుకు) చేయవచ్చును.

ఎద్దుబండి మీదగానీ, లేదా చిన్న ట్రక్కుమీదగానీ, పల్లెలకు తీసుకువెళ్ళి వ్యవసాయ పనిముట్లు, ఇంటి సామగ్రి మరమ్మతు చేసే యంత్రాన్ని కూడా అక్కడ ప్రదర్శించారు. పెట్రోలుతో దానిని పని చేయించవచ్చును.

వివిధ లోహపు రేకులలో నిత్యావసర వస్తువులను ఆధునిక పద్ధతులలో తయారు చేయటాన్ని ఆ డేరా మరొక విభాగంలో ప్రదర్శిస్తారు. పూర్వ కాలంలో అచ్చు తయారుచేసి, పంచ్ చేసి, యంత్రాలతో అనుకున్న విధంగా లోహపు రేకులను కొక్కి, వివిధ సామగ్రి తయారు చెయ్యవలసి వచ్చేది. ఈనూతనస్పిన్నింగ్ విధానంవలన ఫలయాకారపు కత్తెరలో లోహపు రేకులు కావలసిన పరిమాణానికి కత్తిరింపబడి, మెటల్ స్పిన్నింగ్ లేత్ మిషన్ మీద కొయ్య కట్టుగానాననుసరించి ఎక్కువ వేగంగా తిరుగుతూ అనుకొన్న వస్తువులను త్వరలో తయారు చేయగలుగుతున్నవి.

5000 రూపాయల పెట్టుబడి అవసరమయ్యే ఈయంత్రాలతో యాప్ స్టీలు, లైట్ రిఫ్లెక్టర్లు, ల్యాంప్ షేడులు, కప్పులు, సాసర్లు, పాత్రలు మొదలైన వాటిని తయారు చేయవచ్చును.

ఆ లేత్ వడ్రంగపు పనులకు కూడా ఉపయోగించుకొనవచ్చును.

ఈ పారిశ్రామిక శాలలో మరొక చోట ఉష్ణప్రయోగ (హీట్ ట్రీట్‌మెంట్) పరికరాలను ప్రదర్శిస్తారు. ఆధునిక పరికరాలతో శాస్త్రీయ పద్ధతిలో ఉష్ణాన్ని ప్రయోగించినట్లయితే తయారు చేసిన వస్తువులన్నీ ఒకేవిధంగా నిర్దిష్టంగా ఉంటవి.

ఈ కొలుములను ప్రదర్శించటంలో గల ఉద్దేశ్యం—భారత దేశంలోని చిన్న పనిముట్లు, భాగాలు తయారు చేసే వారందరూ వారి కర్మాగారాల్లో ఈ నూతన ఉష్ణప్రయోగ యంత్రాన్ని ఉపయోగించి నాణ్యతలో దిగుమతి చేసుకొన్న వస్తువులతో సరి తూగగల వస్తువులను తయారు చేయగలిగి ఆర్థిక స్వయంపోషకత సాయపడగలిగేటట్లు వారికి తోడ్పడటం.

ఈ సెట్ ఖరీదు సుమారు రు. 7,500 లు ఉంటుంది. అమెరికాలో లాగ ఇక్కడ కూడా హీట్ ట్రీట్ మెంటులో ఒక వ్యక్తి ప్రత్యేక శిక్షణ పొంది పనిముట్లు, విడిభాగాలు తయారు చేసేవారి వద్దనుంచి ఈ ప్రత్యేక పనికి ఆర్డర్లు తెచ్చుకొనవచ్చును.

మరొక శాలలో ప్రస్తుతం భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కృత్రిమ ఉపగ్రహ నిర్మాణంలో అనుసరించిన రూపొందించిన లోహపు పూత విధానాన్ని ప్రదర్శిస్తారు.

శబ్ద తరంగాలతో 1/10 000 అంగుళం వరకూ ఖచ్చితంగా ఉండే ఫ్రీడ్ డ్రిల్ తయారుచేసే ఇంపాక్ట్ గ్రైండర్; కొయ్యతో విద్యా విషయక కొమ్ములు తయారు చెయ్యగల కాంబినేషన్ పనిముట్లు; కొయ్య సామగ్రి విడిభాగాలను తయారుచేసే కూర్పు (ప్రిఫ్ ఫాబ్రికేషన్) వడ్రంగపుశాల; పశ్చాత్తరికి 5,000 మోటారుకార్లను గానీ, బస్సులను గానీ, లారీలను గానీ మరమ్మతు చేయగల ఒక మోటారు ఇంజన్ రీబిల్డింగ్ శాలలను కూడా ఆ డేరాలో ప్రదర్శించారు.

కేరళ నేర్పిన గుణ పాఠాలు

కేరళ రాష్ట్రంలో ఎట్టకేలకు కమ్యూనిస్టు పరిపాలన అంతమైనది. రాష్ట్రంలో కల్లోలం చల్లారినది. బీభత్సంగా పరిణమించిన రాష్ట్ర రాజకీయ వాతావరణంలో ఇప్పుడిప్పుడే ప్రశాంతత నెలకొంటున్నది. రాదాపు స్తంభించిపోయిన పరిపాలనా యంత్రాంగం సమర్థవంతంగా పని చేయటం, న్యాయశాఖ నిర్భీతిగా ధర్మ నిర్వహణ చేయటం తిరిగి ప్రారంభమైనది. ప్రజలను రెండు వర్గాలుగా చీలదీసిన స్థితిగతులు క్రమేణా మారుతున్నాయి.

కేరళ ప్రజల శ్రేయస్సును కాంక్షించే ప్రతి ఒక్కరూ కేంద్రం చర్యపట్ల హర్షామోదాలను వ్యక్తం చేసారు. దేశం అంతటికీ ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు (పార్లమెంట్‌లో) కేంద్రం చర్యను ఆమోదించారు. తమ పరిపాలన అర్థాంతరంగా అంతమైనందుకు కమ్యూనిస్టులు శోకించటంలో అసహజమేమీ లేదు. కేంద్రం తప్పని సరిగా చర్య తీసుకొన వలసినంతటి బలవత్తరమైన పరిస్థితులు దాపురించినందుకు విచారించిన కమ్యూనిస్టేతరులు సైతం లేక పోలేదు.

తప్పనిసరి చర్య

రాజ్యాంగానుసారం సక్రమంగా పరిపాలనను నిర్వహించటం అసాధ్యమైన పరిస్థితి ఏర్పడినదని కేరళ గవర్నర్ నివేదికను సమర్పించిన మీదట కేంద్రం రాజ్యాంగం 356వ సెక్షన్ ప్రకారం బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినది. కమ్యూనిస్టు పార్టీ నియంతల దుష్కృత్యాలను గూర్చి కె. పి. సి. సి. గాని, మన్నాత్ పద్మనాభన్ గాని, మరి ఇతరులుగాని చేసిన ఫిర్యాదుల వల్లనే కేంద్రం చర్య తీసుకొన్నదనటం అసమంజసం. రాష్ట్ర రాజకీయాలలో ఉపద్రవకరంగా పరిణమించినట్టు ముఖ్యమంత్రిగా శ్రీ నంబూద్రిపాద్ సైతం కేంద్రం నాయకులకు తెలియ జేసారు. విమోచనోద్యమం సందర్భంగా వేలాది మంది జైలు శిక్షలను భరించారు. కొందరు అమాయక ప్రజలు కమ్యూనిస్టు ప్రభుత్వం తుపాకి కాల్పులలో ప్రాణాలను బలి చేసారు. లాఠీ, బాష్పవాయు ప్రయోగాలలో ఎందరో గాయపడ్డారు. ప్రజా వాహిని విజృంభించినది. రాష్ట్రం ఉద్యమం ఘురింతకు ఉన్నతమైనది. రాజకీయాలు ఘురింత విషమ రూపం ధరించి, ఎన్నో విపత్తులు సంభవించనున్న తరుణంలో కేంద్రం చర్య గైకొన్నది. కేంద్రం సకాలంలో ప్రజలను ఆదుకొనక, అత్యాచారం చేసిన పక్షంలో ఇంకా ఎన్ని విపత్కార సంఘటనలు జరిగి ఉండేవో ఊహించటం కష్టం కాదు.

ప్రజలలో అసంతృప్తి ప్రబలినదృష్ట్యా కమ్యూనిస్టులు తప్పుతట్టకుండా అధికారం నుంచి తప్పుకొని ఉంటే వారికీ, ఇతరులకు కూడా గౌరవప్రదంగా ఉండేది. అయితే నిందను కేంద్ర ప్రభుత్వంపై నెట్టివేసే సంకల్పంతో కమ్యూనిస్టులు ప్రభుత్వం నుంచి వైదొలగటానికి మొండిగా నిరాకరించారు. రెండు ఓట్ల మెజారిటీ ఉన్నంతకాలం పదవులను త్యజించ వలసిన అవసరం లేదని కమ్యూనిస్టులు వాదించారు.

ముమ్మాటికీ ప్రజా ఉద్యమం

అరాచకాన్ని, హత్యాకాండను ప్రచారంచేసే నిస్సంకల్పంతో కేంద్రం విధిలేక చర్య తీసుకొన్నది. రాష్ట్రపతి ప్రకటన వెలువడిన రోజున కేరళ ప్రజలు పండుగ జరుపుకొన్నారు. రాష్ట్రం అంతటా ఆనందోత్సాహాలు చెలరేగినవి.

ప్రజల అభిప్రాయాలు లేని ఏ ఉద్యమమైనా విజయవంతం కాలేదన్న విషయం నిర్వివాదాంశం. స్వాతంత్ర్యోద్యమం తర్వాత దేశ చరిత్రలో ఇదే ముఖ్యమైన సంఘటన. కమ్యూనిస్టులు తప్పించి అన్ని రాజకీయ పక్షాలు ఉద్యమంలో పాల్గొన్నారు. కాథలిక్ మతస్థులు, మన్నాత్ పద్మనాభన్ నాయకత్వాన నాయర్ కులస్థులుకూడా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. యావన్మంది ప్రజలు ఉద్యమంలో పాల్గొనటం వల్లనే కమ్యూనిస్టు ప్రభుత్వం పతనమైనది. ఫలానా రాజకీయ పక్షంపట్ల మోజువల్ల ప్రజలు ఉద్యమాన్ని బలపరచ లేదన్న విషయం గమనార్హం. కేరళ సంఘటన నిజానికి నాటు కమ్యూనిస్టుల పరాజయం. ఇది కమ్యూనిస్టేతర పక్షాల విజయమని చెప్పటానికి వీలులేదు. కేరళ సంఘటన ముమ్మాటికీ ప్రజా విజయం. ప్రజాస్వామ్య శక్తులకు నైతిక విజయం.

కమ్యూనిజం పట్ల మోజులేదు

ప్రజాస్వామ్య యంత్రాంగంలో కమ్యూనిస్టులు అధికారం చేపట్టడం ప్రపంచ చరిత్రలో మొదటి సారిగా కేరళలో జరిగినది. అందుకే కేరళ సంఘటనలకు అంతర్జాతీయ ప్రాముఖ్యం లభించినది. ప్రపంచంలో ఎక్కడా ప్రజలు కోరి కమ్యూనిస్టులను గద్దెకక్కించలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టులకు స్థానం లేదని కూడా కేరళ ప్రజలే నిరూపించారు. భారత ప్రజలు అహింసా వాదులనీ, ప్రజాస్వామ్య ప్రియులనీ కేరళ ప్రజలు రుజువు చేసారు.

కేరళలో కమ్యూనిస్టులు అధికారాన్ని ఎలా చేపట్ట గలిగారు? కమ్యూనిజం పట్ల మోజుతో ప్రజలు అధికారాన్ని వారికి దత్తం చేయలేదు. కేరళలో విద్యావంతుల సంఖ్య ఎక్కువ. నిరుద్యోగ సమస్య అత్యంత తీవ్ర రూపం ధరించినది. పూర్వం తిరువాన్కూర్-కొచ్చిన్ రాష్ట్రంలో వెనుకటి ప్రభుత్వాలు సాంఘిక, ఆర్థిక సమస్యలను సక్రమంగా పరిష్కరించలేక పోయాయి. కాంగ్రెస్ వారులు పదవీచ్యుతులైన తర్వాత రాజకీయంగా అవిశ్రాంత పరిస్థితి ఏర్పడినది. విప్లవాత్మకంగా సమస్యల సత్వర పరిష్కారం అవసరమని ప్రజలు భావించారు. భూసంస్కరణ ప్రజలు భావించారు. భూసంస్కరణ ఆశించే సుస్థిర ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు భావించారు. కోరి కమ్యూనిస్టులకు అధికారం దత్తం చేయటానికి కేరళ ప్రజలు విద్యా విహీనులు కారు. సమర్థవంతమైన ప్రతిపక్షం మరొకటి లేని కారణంగా కమ్యూనిస్టులకు ప్రజలు ఒకసారి అవకాశమిచ్చారు.

1957 వ సంవత్సరం సాధారణ ఎన్నికలలో కేరళ కమ్యూనిస్టులకు మొత్తం ఓట్లలో 34.2శాతం వచ్చాయి 1952 ఎన్నికలలో (మలబార్, తిరువాన్కూర్, కొచ్చిన్ ప్రాంతాలు కలిసి) కేరళలో కమ్యూనిస్టులకు 17.5 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టుల బలం రెండింతలు పెరిగినది. రష్యాలో రాజకీయ కుట్ర ద్వారా, చైనాలో అంతర్యుద్ధం ద్వారా ప్రభుత్వాలను కైవసంచేసుకొన్న కమ్యూనిస్టుపార్టీ కేరళలో ప్రజాస్వామ్య పంథాలో అధికారాన్ని హస్తగతం చేసుకొన్నది.

పతన హేతువు

కేరళ కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారాన్ని చేజిక్కించుకొన్న వ్యక్తికీ, పరిపాలన విషయంలో మట్టుకు సహజ గుణాలను విడిచిపెట్టలేదు. ప్రతి పక్షాలను అణగద్రొక్కటానికి ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వంతో సరిసమానంగా పార్టీ నియంతలు అధికారం చెలాయించారు. పరిపాలనా యంత్రాంగంలో పార్టీ ప్రాబల్యం పెరిగినది. చివరకు న్యాయ నిర్వాహణలో సైతం కమ్యూనిస్టులు జోక్యం చేసుకొన్నారు. "కమ్యూనిస్టులే ప్రజలు. ఇతరులు అభివృద్ధి నిరోధకులు" అనే ధోరణిలో పరిపాలన సాగింది. ఇదే వారి పతనానికి హేతువైనది. ప్రజలలో కోపోద్రేకాలు రెచ్చి పోయాయి. కమ్యూనిస్టుల దుష్పరిపాలన అంతమొందించటానికి ప్రజల కంకణం కట్టుకొన్నారు. ఉద్యమం రానురాను ఉధృతమై ఎట్టకేలకు ప్రజలు విజయులైనారు. ప్రజల అండదండల కారణంగానే ఉద్యమాన్ని విజయవంతం చేయటం సులభ సాధ్యమైనది. ఉద్యమ నిర్వాకులపట్ల అభిమానంతోగాని, ఇతర రాజకీయ పక్షాలపట్ల అసూయతోగాని ప్రజలు సహకరించటం జరగలేదు.

గుణపాఠం

కేరళ సంఘటన యావద్భారత దేశానికేగాక స్వేచ్ఛా ప్రపంచానికి గుణపాఠం. చిల్లరమల్లర పార్టీలు అనేకం స్థాపించినందువల్ల ప్రయోజనం లేదు. దేశంలో అన్ని రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ పరిపాలన సాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి కూడా ఇది గుణపాఠం. పరిపాలనలో లోపాలు ఉంటే ప్రజలు ప్రభుత్వంలో మార్పును వాంఛిస్తారు. సమర్థవంతమైన మరో ప్రతిపక్షం లేకపోతే కమ్యూనిస్టుల కైనా ఓటు చేయటానికి ప్రజలు వెనుదీయక పోవచ్చు.

కేరళలో పార్టీ బలాలు

కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టులు పతనమైనంత సులభంగా కాంగ్రెస్ గెలుపొందటం కష్టం. 1952వసంవత్సరం ఎన్నికలలోనూ, 1957 సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కాంగ్రెస్ బలం తగ్గినట్టు స్పష్టమౌతుంది. 1952 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కేరళలో మొత్తం ఓట్లలో 42.3 శాతం వచ్చాయి. 1957 ఎన్నికలలో కాంగ్రెస్ 36.7 శాతం ఓట్లను మాత్రమే గెలుచుకొనగలిగినది. భూసంస్కరణ మంత్రి వర్గం కొన్నాళ్లు పరిపాలన సాగించిన ఫలితంగా కేరళలో ప్రజాసోషలిస్టుల బలం సగానికి సగం తగ్గినదేగాని, పలుకుబడి ఎంతమాత్రం హెచ్చలేదు. 1952ఎన్నికలలో 20.9 శాతం ఓట్లను గెలుచుకొన్న ప్రజాసోషలిస్టులకు 1957 ఎన్నికలలో 10.4 శాతం ఓట్లు మాత్రమే దక్కినవి. రివిజనిస్టు సోషలిస్టు పార్టీకి కార్మిక వర్గాలలో ప్రాబల్యం పెరిగినది. ప్లాంటేషన్ పరిస్థితుల కారణంగా ముస్లింలీగ్ బలం కూడా కొద్దిగా హెచ్చినది.

కర్తవ్యం

పార్టీ బలాబలాల దృష్ట

బెంగాల్‌లో కొత్త రైలు మార్గాల నిర్మాణం

ఖర్గపూర్, ఆగస్టు 30

సూనె శుద్ధి కర్మాగారాలను స్థాపిస్తున్న కారణంగా అస్సాం, ఉత్తర బెంగాల్ ప్రాంతాలలో మూడవ ప్రణాళిక పథకాలక్రింద కొత్త రైలుమార్గాల నిర్మాణం జరగగలదని కేంద్ర రైల్వే మంత్రి శ్రీ జగ్‌జీవన్ రామ్ నేడు ప్రకటించారు.

మూడవ ప్రణాళిక క్రింద రైల్వేల అభివృద్ధికోసం అయ్యే ఖర్చు రెండవ ప్రణాళికలో కంటె హెచ్చుగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

రెండు రోజుల పర్యటనకు గాను ఆయన ఇక్కడకు వచ్చారు.

విలేఖరుల గోష్ఠిలో ప్రసంగించిన సందర్భంగా ఆయన పై విషయాలను వెల్లడించారు.

ఆకాశవాణి

బుధవారం, సెప్టెంబర్ 2, 1959

హైదరాబాద్-[ఎ]

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్ (స్టూ. 8.) 6-35 కార్యక్రమ పరిచయం 6-40 భక్తి రంజని: నారాయణతీర్థుల వారితరంగాలు 7-00 తెలుగులో వార్తలు 7-15 ఎమ్. ఎస్. మహాదేవన్ 7-45 సంగీత శిక్షణ 8-00 ఆంగ్లమున వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 హిందూస్థానీ సంగీత పాఠం 8-45 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము 1-00 మహిళాసమాజం 1-30 లయవిన్యాసం: నిలయవిద్వాంసులు 1-50 తెలుగులో వార్తలు 2-00 శాస్త్రీయ సంగీత్ (గ్రా. 8.) 2-10 ఉర్దూలో వార్తలు 2-20 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ) 2-50 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి. 3-45 ఉన్నత పాఠశాలలకు 4-15 ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 ఘజల్ దక్కనీమే, ఉర్దూలో ప్రత్యేక కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 ఆదాన్ ప్రదాన్ 7-30 వార్తా వాహిని 7-40 విరామ సంగీతం (గ్రా. 8.) 7-45 ఎమ్. విద్యాసాగర్: గీత్ 8-00 నిచ్చెనలు పాములు: నాటిక (విజయవాడనుండి 8లే) 8-30 జాతీయ కార్యక్రమ ప్రసంగం (ఢిల్లీనుండి 8లే) 8-50 ఎమ్. విద్యాసాగర్: గీత్ 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 ఉర్దూలో వార్తలు 9-30 హిందూస్థానీ సంగీత సభ (బొంబాయినుండి 8లే) 11-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

బి

42.02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎ వలె 8-45 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైదరాబాద్ ఎ వలె 2-10 వేణువు: నిలయ విద్వాంసుడు 2-20 ఎమ్. ఎస్. మహాదేవన్ 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి. 3-45 హైదరాబాద్ ఎ వలె 4-15 ప్రసార సమాప్తి.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 హైదరాబాద్ ఎ వలె 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 లలిత్ సంగీత్ (విజయవాడ నుండి 8లే) 9-30 హైదరాబాద్ ఎ వలె 11-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు 6-35 వాద్య సంగీతము 6-40 భక్తిరంజని (హైదరాబాద్ నుండి 8లే) 7-00 తెలుగులో వార్తలు 7-15 హైదరాబాద్ ఎ వలె 7-45 సంగీత శిక్షణ 8-00 ఆంగ్లమున వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం (గ్రా. 8.) 1-00 ద్వారం వెంకటస్వామి నాయుడు: వయొలిన్ (స్టూ. 8.) 1-50 తెలుగులో వార్తలు 2-00 ప్రసార సమాప్తి. 3-30 శ్రోతలుకోరిన పాటలు 3-45 ఉన్నత పాఠశాల విద్యార్థులకు (హైదరాబాద్ నుండి 8లే) 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 గ్రామస్థుల కార్యక్రమము, ఫిల్ము గీతం (గ్రా. 8.) 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-08 రేడియో వార్తా వాహిని (హైదరాబాద్ నుండి 8లే) 7-40 లలిత సంగీతం: పల్లెకొండ విక్టర్ 8-00 నిచ్చెనలు, పాములు: నాటిక, రచన: గోరాశాస్త్రి 8-30 జాతీయ కార్యక్రమము (ఢిల్లీ నుండి 8లే) 8-50 శాస్త్రీయ సంగీతం (గ్రా. 8.) 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 లలిత సంగీతం: పల్లెకొండ విక్టర్ 9-30 భక్త మార్కండేయ 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

పెరిగిపోతున్న చేనేత నిల్వలు: ప్రభుత్వ సహాయానికి అభ్యర్థన

మంగళగిరి, ఆగస్టు 30

కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల ప్రతినిధుల సమావేశం గత శుక్రవారం ఇక్కడ శ్రీ రమాకాంతరావుగారి (ఎమ్. ఎల్. సి.) అధ్యక్షతన జరిగినది. ఇండియా టెక్స్‌టైల్ కమిషనర్ శ్రీ డి. ఎస్. జోషీ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

శ్రీ రమాకాంత రావుగారు తన ప్రసంగంలో చేనేత బట్టల నిల్వలు-ఇటు సహకార రంగంలోను, ప్రైవేట్ రంగంలోను-నానాటికీ పెరిగిపోతుండటం పట్ల ఆందోళన ప్రకటించి వాటిని విడుదలచేసే విషయంలో తగిన సహాయం చేయాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. మిల్లు చేనేత విషయంలోను, పవర్ నూలుల విషయంలోను తృతీయ ప్రణాళికలో ఒక ఉమ్మడి ఉత్పత్తి కార్యక్రమాన్ని రూపొందించాలనీ, చేనేత పరిశ్రమకు ఎక్కువ రక్షణ ఇవ్వాలని కూడా ఆయన అభ్యర్థించారు.

శ్రీ ప్రగడకోటయ్యగారు చేనేత పరిశ్రమకు ఇవ్వబడిన రిజర్వేషన్‌ను మిల్లులు అతిక్రమిస్తున్నాయని అన్నారు. రంగుచీరలు కేవలం చేనేత పరిశ్రమకు కేటాయించినప్పటికీ మిల్లులు వాటిని ఉత్పత్తి చేయటం మానలేదని ఆయన అన్నారు. ఎగుమతుల నిమిత్తమై కేటాయించిన వాటిని కూడా మిల్లులు దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నాయని ఆయన అన్నారు. మిల్లు గుడ్డలపై ఇటీవల ఎగైన్ సుంకాన్ని తగ్గించటం, అమ్మకం పన్ను రద్దుచేయటాన్ని గూర్చి ప్రస్తావించి వాటిమూలంగా చేనేత పరిశ్రమకు చాలా దెబ్బ తగిలిందని శ్రీ కోటయ్యగారు అన్నారు.

టెక్స్‌టైల్ కమిషనర్ శ్రీ జోషీ గారు దీనికి సమాధానంగా తన ప్రసంగంలో అవకాశం ఉన్న చోటల్లా ప్రభుత్వం ప్రైవేట్ రంగంలోని వారికంటె చేనేత సహకార సంఘాలకు ఎక్కువ ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు.

మార్కెట్‌లో రంగులు, రసాయన ద్రవ్యాలు కొరవడటాన్ని గూర్చి ప్రస్తావించి విదేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవటానికిగాను ఖర్చు ప్రభుత్వం 15 లక్షల రూపాయలు కేటాయించిందనీ, సడుకు జేరిన తర్వాత రాష్ట్రాలలోని సహకార సంఘాలకు, ప్రైవేట్ రంగంలోని వారికి వాటిని పంచిపెడతారని ఆయన అన్నారు.

నారాయణపేట బేసిక్ ట్రెయినింగ్ స్కూలు ప్రారంభోత్సవం

నారాయణపేట, ఆగస్టు 30

బేసిక్ శిక్షణాలయానికి ప్రారంభోత్సవం చేసే నిమిత్తం విద్యాశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టరు శ్రీ మీర్జా మహ్మద్ అలీబేగ్ ఈ నెల 24 వ తేదీన ఇక్కడకు వచ్చారు. ఆ రోజు సాయంత్రం జాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో బాలుర మధ్యాహ్న భోజన పర్పట్లను ఆయన ప్రారంభించారు.

ఆ తరువాత శ్రీ మీర్జా బేసిక్ శిక్షణాలయానికి ప్రారంభోత్సవం చేశారు. డిప్యూటీ కలెక్టరు శ్రీ కె. రామారావు అధ్యక్షతన సభ జరిగింది. ప్రధానాధ్యాపకులు శ్రీ ఎన్. అప్పారావు, శ్రీ బన్నప్పగౌడ్, శ్రీ రాంచందర్ రావు కల్యాణి (మునిసిపల్ చైర్మన్) ప్రసంగించారు.

ఆగస్టు 26 వ తేదీన శ్రీ మీర్జామహ్మద్ అలీబేగ్ గారు ప్రాథమిక పాఠశాల పేరపళ్ళలో బాలుర మధ్యాహ్న భోజన పర్పాట్లకు ప్రారంభోత్సవం చేసారు.

రాష్ట్ర ఇంజనీర్‌పై స్పెషల్ పోలీసు చర్య

న్యూఢిల్లీ, ఆగస్టు 31

కేంద్ర ప్రభుత్వ స్పెషల్ పోలీసుశాఖ వారు ఈయేడాది జూలై నెలలో మొత్తం 108 మంది ప్రభుత్వోద్యోగులపై బహిరంగ విచారణ జరిపారు. వారిలో 17 మంది గెజిటెడ్ ఆఫీసర్లు.

ఆంధ్ర ప్రదేశానికి చెందిన ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విషయంలోను, ప్రభుత్వాన్ని దాదాపు 3 లక్షల రూపాయల వరకు మోసగించిన ఇద్దరు కస్టమ్స్ అధికార్ల విషయంలోను దర్యాప్తు పూర్తిఅయి సేరవిచారణ ప్రారంభమైనది.

ఇందిరా గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 30

ఇరాన్, ఆఫ్‌ఘనిస్థాన్ పర్యటన సమయంలో ప్రధాని నెహ్రూ వెంట శ్రీమతి ఇందిరాగాంధీ కూడా వెళ్ళుతున్నారు. ఉభయ దేశాల ప్రభుత్వాలు ఆమెను కూడా ఆహ్వానించాయి.

నెహ్రూ వెంట వెళ్ళే బృందంలో విదేశాంగ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. దత్ కూడా ఉంటారు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు

జనవరిలో మహా సభలు జరపటానికి నిర్ణయం

గుడివాడ, ఆగస్టు 31

ఆంధ్ర నాటక కళా పరిషత్తు కార్యవర్గ సమావేశము ఈ నెల 25 వ తేదీన గుడివాడ శరత్ టాకీస్‌లో అధ్యక్షులు శ్రీ రంగయ్యప్పారావు గారి అధ్యక్షతన జరిగినది.

సుప్రసిద్ధ నాటక కళోపాసకులు శ్రీ రైతా గోపాలం, కిలాంబి కృష్ణమాచార్యులు, వి. వి. కృష్ణయ్యగార్ల మరణములకు సంతాపము తెలుపబడినది.

అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో విద్యార్థులకు నాటక శిక్షణ తరగతులను పరిషత్తు యాజమాన్యమున నిర్వహించుటకు అవకాశము కలిగిన కళాశాలాధికారులను అందుకు పలయ సహాయసంపత్తి నొసంగుచున్న రాష్ట్ర సంగీత నాటక అకాడమి వారిని అభినందించడమైనది. ఈ నాటక శిక్షణ తరగతులకు గౌరవాధ్యాపకులుగా శ్రీ బసవరాజు వెంకటసుబ్బారావుగారిని నియమించాలని నిర్ణయించారు.

రాబోవు పరిషత్తు మహాసభలు 1960 జనవరి మొదటి వారంలో తణుకులో జరుపుటకు శ్రీ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ గారు, తదితర ప్రముఖులు పంపిన ఆహ్వానాన్ని కార్యవర్గం ఆమోదించినది. ఈ మహాసభలకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని, మైసూరు గవర్నర్ శ్రీ జయచామరాజ వడయార్ గారిని అధ్యక్ష ప్రారంభకులుగా ఆహ్వానించుటకు తీర్మానింపబడినది. మహాసభల నాటి పరిషత్తు విశేష సంచిక ప్రచురించుటకు నిర్ణయిస్తూ, దీనికి తగు ఏర్పాట్లు చేయటకు ప్రధాన కార్యదర్శి కథికాని మొసగబడినది. ఈ మహాసభల నిమిత్తము రాష్ట్ర సంగీత నాటక అకాడమి వారిని రూ. 12,000 విరాళముగా నిప్పించ గోరుచు, ఇందుకు వలయు యత్నములు చేయవలసినదిగా అధ్యక్షులకు అధికార మివ్వడమైనది. ఈ మహాసభలలో ఒకనాటి కార్యక్రమముగా ఆంధ్ర నాటక రంగ వజ్రోత్సవము జరుపుటకు తీర్మానింపబడినది.

గుడివాడలో నాటక శిక్షణ తరగతులకు ప్రారంభోత్సవం

గుడివాడ, ఆగస్టు 31

ఆంధ్ర నాటక కళాపరిషత్తు యాజమాన్యమున అక్కినేని నాగేశ్వరరావు కళాశాలా విద్యార్థులకు నిర్వహింపబడు నాటక శిక్షణ పాఠముల ప్రారంభోత్సవము ఈ నెల 25వ తేదీన 5 గంటలకు వైభవముగా జరిగినది. నటరాజశేఖర శ్రీ డి. వి. సుబ్బారావుగారు ఉత్సవ మహాసభ కార్యక్షత వహించి, కళాశాల విద్యార్థులు "వందేమాతరమ్" గీతముతోను, కళాశాలాధ్యక్షులు శ్రీ ఎ. ఎఫ్. త్యాగరాజుగారి స్వాగత వచనములతోను కార్యక్రమము ప్రారంభమైనది. శ్రీ యర్రోజు మాధవాచార్యులుగారు పరిషత్తు సంకల్పించిన ఈ నాటక శిక్షణ తరగతులను గూర్చి, ఇందుకు రాష్ట్ర సంగీత నాటక అకాడమివారు చేయుచున్న సహాయాన్ని గూర్చి తెలిపారు.

పరిషదధ్యక్షులు శ్రీ రంగయ్యప్పారావుగారు తరగతులకు ప్రారంభోత్సవం చేస్తూ నాటక కళా విశిష్టతను గూర్చి ఈ తరగతుల ఉద్దేశమును గూర్చి గంభీరముగా నుపన్యసించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ పసల సూర్యచంద్రరావు, రామచంద్ర కాశ్యప, ఎ. ఆర్. కృష్ణ, నటరాజ రామకృష్ణ, పులిపాటి వెంకటేశ్వర్లు, శ్రీమతి పూర్ణిమా దేవి, ఆర్. కె. రామలింగాలెడ్డి, కొడాలి అతిశేషయ్య, ప్రభృతి శ్రీ రామమూర్తి, సుంకర కనకారావు గారలు నాటక కళ, నాటకరంగమునకుసంబంధించినవివిధసమస్యలనుగూర్చి ఉపన్యసించారు. శ్రీ బసవరాజు వెంకట సుబ్బారావు, నటరాజ రామకృష్ణ, పులిపాటి వెంకటేశ్వర్లు, శ్రీమతి పూర్ణిమా దేవిగార్లు అభినయ ప్రదర్శనములొసంగి సభను రంజింపజేసారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 28

లాహోస్‌కు ఇండియాపర్యవేక్షకులను పంపాలని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ-జనరల్ శ్రీ డాగ్ హామర్ షెల్డ్ చేశాడన్న సూచనకు సంబంధించి భారత ప్రభుత్వానికి ఇంత వరకు అధికారికంగా ఎట్టి ప్రతిపాదన అందలేదని నేడు ఇక్కడ అధికార వర్గాల వారు తెలియజేసారు.

విచారణ సంఘాల ఖర్చు 22 లక్షలు

న్యూఢిల్లీ, ఆగస్టు 30

1957-58 సంవత్సరంలో భారత ప్రభుత్వం మొత్తం 14 విచారణ సంఘాలను నియమించినది. వాటి కయిన మొత్తం ఖర్చు దాదాపు రూ. 22 లక్షలు.

రైల్వే విమాన ప్రమాదాలకు సంబంధించిన విచారణ సంఘాలు పై వాటిలో జేర్చబడలేదు.

వాషింగ్‌టన్, ఆగస్టు 28

ఇండియా కావాలని కోరితే తప్పించి భారత సరిహద్దులో చైనా దురాక్రమణకు సంబంధించి ఐక్యరాజ్యసమితి ఎట్టి చర్యా తీసుకొనరాదనీ డెమోక్రటిక్ సెనేటర్ శ్రీ జాన్ శర్మన్ కూపర్ నేడొక ప్రకటనలో ఉద్ఘాటించారు.

ధరవరలు

కొత్తూరు సీతయ్య సప్త దుకాణం

సోమవారం, 31-8-1959

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్, ఆం. ప్ర		
సన్న బియ్యము	68-8-0	77-0-0
దొడ్డు బియ్యము	61-8-0	63-0-0
అక్కులు ,,	64-0-0	65-0-0
19 నెం. బి॥	62-0-0	64-0-0
గొట్టె బియ్యము	53-0-0	57-0-0
తెల్ల జొన్నలు	45-8-0	43-8-0
చట్టి ,,	39-8-0	39-0-0
పసుపు	86-0-0	90-0-0
ఎర్ర కందులు చన్నవి		47-0-0
పెసలు	45-8-0	50-5-0
శనుములు	51-0-0	53-0-0
శనగలు	42-8-0	43-8-0
బెల్లము	61-4-0	68-0-0
మిర్చి	270-0-0	300-0-0
చింతపండు	120-0-0	170-0-0
ఉల్లిగడ్డ	19-0-0	24-0-0
గోధుమలు	85-0-0	89-0-0
ఎర్ర గోధుమలు	70-0-0	71-8-0
మక్కగోధుమలు	74-0-0	75-0-0
కుసుమలు	48-0-0	52-0-0
నువ్వులు	95-0-0	100-0-0
ఇలాతిపలుకు బి॥	57-8-0	60-0-0
ఇలాతిపలుకు పె॥	95-0-0	97-0-0
ఆముదాలు	60-8-0	61-0-0
పత్తిగింజలు	36-0-0	42-0-0
నూనె	17-2-0	17-4-0
కందిపప్పు బి॥	88-0-0	91-8-0
కందిపప్పు పె॥	78-0-0	82-0-0
మినప పప్పు	70-0-0	76-0-0
పెసర పప్పు	78-0-0	85-0-0
శనగ పప్పు	45-0-0	44-0-0
పిరిశనగ పప్పు	69-0-0	75-0-0
లంకపప్పు	8[illegible]-0-0	32-0-0
ధనియాలు	12[illegible]-8-0	13[illegible]-4-0
ఇలాతికాయ	66-0-0	—

ధెబ్బడ ధూమయ్య నారాయణ

ఫోన్: నెం. 5260

తేజాపు బంగారం		124-00
కిసాన్ నూర్క్ బి॥		124-25
వెండి తు॥	100కి	205-50
వెండి తు॥	1 కి	2-8
నవరసు		80-00

బొంబాయి, ఆగస్టు 27

ఈవారం "ఋతువుల అవృత్తి" అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని పిల్లల శాఖ వారు విడుదల చేస్తారు. ఈ చిత్రంలో వసంత గ్రీష్మ వర్ష శరత్ మొదలైన ఋతువులు మార్పును ఋతుధర్మం ప్రకారం ప్రకృతి ఎలాంటి మార్పులు వచ్చేదీ చక్కగా వివరీకరించారు.

పశ్చిమ కనుమల్లో వర్షపాతం, తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో వీచిన తుఫాను గాలులూ, హిమాలయాల్లో మంచుకురవడం మొదలైన వాటిని కూడా యీ చిత్రంలో చూడవచ్చు.

న్యూఢిల్లీ, ఆగస్టు 31

కేంద్ర రోడ్డు పరిశోధనా సంస్థ వెలువరించిన ఒక కరపత్రం ప్రకారం దేశంమొత్తంపై ప్రస్తుతం ఉన్న పైకప్పు సంఖ్య 40 లక్షలు; మోటారు బండ్లు 4 లక్షలు; ఎడ్లబండ్లు ఒక కోటి.

న్యూఢిల్లీ, ఆగస్టు 29

ఆఫ్రికియన్ బాలబాలికులకోసం విశ్వవిద్యాలయాలు ఏర్పాటుచేయవలసిన అవసరమున్నదని మాజీ కాంగో ప్రధాని శ్రీ పాట్రిస్ లుమంబా ప్రకటనలో విస్తృతి చేసారు.

జమ్మూ, ఆగస్టు 31

జమ్మూలోని ప్రసిద్ధ రఘునాథ దేవాలయంలో మొన్న రాత్రి దొంగలు పడి కొన్ని లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలు, విగ్రహాలను ఎత్తుకుపోయారు.

RCA
"ఇదిగో
మీకు నచ్చిన
ఆర్‌సిఎ
రేడియో
మళ్లీ వచ్చింది"



డిస్ట్రిబ్యూటర్స్: సినేరమా, 192, సాండ్‌హర్స్ట్ రోడ్, బొంబాయి-7 సబ్ డిస్ట్రిబ్యూటర్స్: భారత్ ఇంజనీరింగ్ కార్పొరేషన్, 3458, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్.
డీలర్స్: క్రేడాల్, గన్ ఫౌండ్రీ, హైదరాబాద్

మీ వ్యాపార కేంద్రాలను, మీ గృహాలను
సంరక్షించుకొనడానికి
చార్ మినార్
ఆస్‌బెస్టోస్ సిమెంట్ ప్రాడక్ట్సును ఉపయోగించండి
మూసటానికి ఇంపుగా ఉండటం, చౌకధరలో లభ్యం, ఎండ వంట ఇంటికైనా అనువుగా ఉండటం చార్ మినార్ ఆస్‌బెస్టోస్ ప్రాడక్ట్సు ప్రత్యేకతలు
మీ అవసరాలన్నింటికీ చార్ మినార్ సిక్కులు, దక్కన్ ఫ్లాట్ షీట్లు, పైపులు తదితర ఎక్సెసరీలను కోరి లాభం పొందండి
మీరు సమీపంలో ఉన్న డీలరులను కలుసుకోండి లేదా, సవివరి కరపత్రాలకై వ్రాసి తెప్పించుకోండి
హైదరాబాద్ ఆస్‌బెస్టోస్ సిమెంటు ప్రాడక్ట్సు లిమిటెడ్
సనత్‌నగర్, హైదరాబాద్-16

ఎట్లు, ఎందుచేత
'అనాసిన్'
అందలి నాలుగు మందులవల్ల
నొప్పిని నివారించుటకు
చాలామంచిది



'అనాసిన్' వైద్యానికంగా చేర్చబడియున్నట్టి అందరి నాలుగు మందులంతో వైద్యుని సరళిత పైత్య పొడర యోగమువలె నొప్పిని అతిక్రమముగాను పూర్తిగాను నివారించును. అనాసిన్ (1) తలనొప్పులు, జలుబులు, వన్ను నొప్పి, నొప్పులు నొప్పులను అతిక్రమముగా నివారించును. (2) వరము పోట్లను శమన పర్చును-మిమ్మలను సుఖముగా విశ్రమింప జేయును. (3) మూర్ఛమును పోగొట్టును. (4) జ్వరమును తగ్గించును. ఈ విధంగా నాలుగు మందులగల 'అనాసిన్' నొప్పి నివారణకు చాలామంచిది. ఎల్లప్పుడూ గృహమందు 'అనాసిన్' ను ఉంచుకోండి.



Registered User: GEOFFREY MANNERS & CO. PRIVATE LTD.
TEL. W 53 6

Cadbury's

పిల్లలకు కాడ్‌బరీస్ చాక్లెట్ బార్... 12 నయాపైసలు మాత్రమే

కెరళ నేర్చిన గుణపాఠాలు

(1వ పేజీ తరువాయి)

ప్రజలు ఇప్పుడు మనసు మార్చుకొని ఓటారనటంలో సందేహం లేదు. కమ్యూనిస్టు సానుభూతిపరుల సంఖ్య కూడా తగ్గి ఉండవచ్చు. అందువల్ల కమ్యూనిస్టేతర పక్షాలకు వచ్చేసారి ఎక్కువ సీట్లు రావచ్చు. అయితే "ఎవరికి వారే" అన్నట్టు ప్రజాస్వామ్య పక్షాలు ఎన్నికలలో పాల్గొంటే తిరిగి కేరళలో రాజకీయ అస్థిరత్వం తప్పదు. ఏ ఒక పార్టీకి మెజారిటీ రాకపోగా క్లిష్ట పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ కొన్ని రాజకీయ పక్షాలుకలసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా అవి అది మూన్నాళ్ళ ముచ్చటే అవుతుంది. వెనుకటి రాజకీయ పక్షాల స్థితిగతులు ఇలా ఉండగా ఇప్పుడు మరొక రాజకీయ పక్షం "స్వతంత్ర పార్టీ" అనే పేరుతో వెలిసింది.

త్వరితగతిని అభివృద్ధి జరగాలని వాంఛిస్తున్న ప్రజలు "కన్సర్వేటివ్" పక్షమైన స్వతంత్ర పార్టీని ఎన్నటికీ బలపరచరు.

సహకారం అవసరం

ఏ రాజకీయ పక్షానికీ ప్రస్తుతం తగినంత బలం లేని కారణంగా కేరళలో ప్రజాస్వామ్య పక్షాలు కొన్ని "పదో విధంగా" ఒక ఎన్నికల ఒప్పందాన్ని చేసుకొనటం అవసరం. సిద్ధాంత రీత్యా అంతగా అంతరాలు లేని సోషలిస్టు పక్షాలతో కాంగ్రెస్ ఒక సమిష్టి కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. కేరళలో ముస్లింలీగ్ వంటి మత ప్రధానమైన సంస్థలు కూడా ఉన్నాయి. ఇటువంటి పక్షాల విషయంలో కాంగ్రెస్ జాగ్రత్తగా వ్యవహరించటం శ్రేయస్కరం.

హైదరాబాద్, ఆగస్టు 30

నారీసుధార్ సొసైటి అధ్యక్షురాలుగా శ్రీమతి లలితాసచార్ ఏకగ్రీవంగాఎన్నికైనారు.

సొసైటి ప్రస్తుత అధ్యక్షురుగా విద్యా మంత్రి శ్రీ ఎస్.బి.పి. పట్టాభిరామారావు.

9వ సంయుక్త వారం!

ప్రభాత్ వారి

గాంధారి గర్వభంగం

సాగర్ మోహన్ జి.ఆర్. టాకీస్

హైదరాబాద్ నిజామాబాద్ హనుమకొండ

ఆటల సమయాలు : 6-00, 9-30

(Nima) — పూర్ణా రిలీజ్

3వ దిగ్విజయ వారం!

ఇండియాలో ప్రప్రథమంగా తయారైన పూర్తి గేవాకలర్ జంగిల్ చిత్రం

బసంత్ పిక్చర్స్ వారి

జంబో (తెలుగు)

అలంకార్ - సికింద్రాబాద్

(Nim) నేడు 2 ఆటలు: 6-15, 9-30 — ప్రసాద్ రిలీజ్ —

విజయవంతమైన 6వ సంయుక్త వారం!

రంగారావు, రేలంగి, గుమ్మడి, లక్ష్మీరాజ్యం, సంధ్య, సూర్యకాంతం, టీటా, జేబీ ఉపు

ప్యాలెస్ రాజేశ్వర్ రామా

హైదరాబాద్ సికింద్రాబాద్ వరంగల్

ఆటల సమయాలు: 6-00, 9-30

(Trupix) — నవయుగ రిలీజ్ —

పార్లమెంటులో ప్రశ్నోత్తరాలు:

డీసెల్ రైలుకార్ల తయారీ

న్యూఢిల్లీ, ఆగస్టు 29

భారతదేశంలోనే డీసెల్ ఇంజన్లు తయారుచేయడం, డీసెల్ రైలుకార్లు కుదరడం, నడపడానికి తగిన అమరిక కుదరడం, ప్రభుత్వం ఆలోచిస్తున్నారు.

పై విషయాన్ని కేంద్ర రైల్వే ఉపమంత్రి శ్రీ షానవాజ్ ఖాన్, శ్రీ రామ్‌కిషన్ గుప్తా అడిగిన ప్రశ్నకు సమాధానం వ్రాసితెలిపారు.

రైళ్ళలో చలవ పెట్టెలు

రైళ్ళలో రవాణా చేసేప్పుడు చెడిపోగలిగే కూరలు, పండ్లవంటివి చెడకుండా జాగ్రత్తగా వుండేందుకు మన రైళ్ళలో చలవ రైల్వే వానులు అమర్చేందే ఆలోచన వుందా అని రైల్వేల ఉపమంత్రి శ్రీ ఎస్. వి. రామస్వామిని ప్రశ్నించారు.

మనదేశం రైల్వేలలో ఇటువంటి చలవపెట్టెలు ఏవీ లేవు. కాని చేపల రవాణాకై ఇటువంటి ఆరు బ్రాడ్‌గేజి పెట్టెలు అమెరికానుంచి రప్పించే ఆలోచన కేంద్ర వ్యవసాయ, ఆహార మంత్రిత్వ శాఖ చేస్తున్నారని, యీ పెట్టెల నిర్వహణ రైల్వేల మంత్రిత్వశాఖ చూస్తారనీ ఆయన చెప్పారు. చేపలవంటి చెడిపోగల వస్తువుల్ని రవాణా చేయడానికి పెద్ద ఎత్తున ఇలాంటి చలవ పెట్టెలు తెప్పించే విషయం, ఇప్పుడు యీ ఆరు పెట్టెల వ్యవహారం ఎలాసాగుతుందో తెలిసినాక రైల్వేలమంత్రిత్వశాఖ ఆలోచిస్తారు.

శ్రీ నారాయణకుట్టి మీనన్, శ్రీ పున్నూస్‌లు అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా ఉపమంత్రి యీ సమాచారం తెలియజేశారు.

గృహ నిర్మాణార్థం పెద్ద పెద్ద ఖండాలుగా భూములను కేటాయించి వాటిని అభివృద్ధి పరచడం కోసం తయారు చేసిన పథకంపై గుడి నిర్ణయాలు జరిగాయనీ, త్వరలోనే యీ పథకంలో ఏయే రాష్ట్రాలకెంతెంత యిస్తుంది మొదలైన పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేయబడగలదనీ ఈ నెల 28వ తేదీన లోక్‌సభలో బర్మన్, సుబోధ్ హన్‌దా, ఎస్. సి. సామంత, ఎస్. ఎ. మేదీ అడిగిన ప్రశ్నకు జవాబుగా కేంద్ర వర్కుస్ గృహ నిర్మాణ సరఫరాల ఉపమంత్రి శ్రీ అనిల్ కె. చందా తెలియజేశారు.

కాగితము, గుజ్జు తయారు చేసే యంత్రాల తయారీ

మెస్సర్స్ తాతా రైలింజన్లు, ఇంజనీరింగు కంపెనీవారు, కాగితమూ, గుజ్జూ తయారు చేసే యంత్రాల్ని, ఇండియాలోనే తయారు చేయాలన్న ఉద్దేశ్యంతో స్వీడన్‌వారి వ్యాపార సంస్థలతో కలిసి కొత్తగా ఒక కంపెనీ స్థాపించ పదలచారు. పై విషయాన్ని లోక్‌సభలో శ్రీ రాంకిషన్ గుప్త, యింకో యిద్దరూ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర పారిశ్రామిక మంత్రి శ్రీ మనూభాయ్ షా తెలియజేశారు.

ఈ కంపెనీ పెట్టుబడిలో నూటికి 60 వంతుల వాటాలు స్వీడన్ వ్యాపార సంస్థవి. సాంకేతిక సుంకం రాయల్టీ చెల్లించడానికి బదులు, కాగితపు గుజ్జు తయారు చేసే యంత్రాల తయారీకి కావలసిన డిజైను, సాంకేతిక శిక్షణనూ స్వీడన్ సంస్థవారు అందచేయగలరని కూడా శ్రీ మనూభాయ్ షా యీ సందర్భంలో తెలియజేశారు.

త్వరలోనే యీ కంపెనీ ఉత్పత్తి ప్రారంభించగలదని కూడా ఆయన అన్నారు.

రక్షణ సామగ్రిలో స్వయం పోషకత్వం

శ్రీ పుల్లారెడ్డి ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 28

రక్షణ శాఖ కార్యదర్శి, శ్రీ ఓ. పుల్లారెడ్డి యీవాళ యిక్కడి రక్షణ ఉత్పత్తులను గురించిన సమావేశంలో ప్రసంగిస్తూ, యిటీవల విదేశీ ద్రవ్యానికి బాగా కటకట పర్వడం ఒక విధంగా చూస్తే మనమంచికే అయిందనీ, దీనివల్ల దేశంలో రక్షణ సామగ్రి ఉత్పత్తిని సర్వతోముఖంగా పెంచవలసిన ఆవశ్యకత మనకు తెలిసివచ్చిందనీ అన్నారు.

రక్షణ సామగ్రి విషయంలో స్వయం పోషకత్వం సాధించడానికి యింతవరకు జరిగిన కృషిని మెచ్చుకుంటూ, యీ కృషివల్ల ఆత్మగౌరవం, భద్రత పెరిగి, దిగుమతుల విషయంలో పరాధీనత చాలావరకు తగ్గిపోయిందని అన్నారు.

ఆర్డినాన్స్ ఫ్యాక్టరీలలోను, ఇతర రక్షణ పరిశ్రమలలోను ఇటీవల జరిగిన అభివృద్ధిని గురించి ప్రస్తావిస్తూ, భారత్ ఎలెక్ట్రానిక్సు ప్రైవేటు లిమిటెడ్‌లో 1959-60 లో ఒక కోటి రూపాయల ఎలెక్ట్రానిక్ సామగ్రి ఉత్పత్తికాగా 1960-61 లో రూ. 1 1/4 కోట్ల సామగ్రి ఉత్పత్తి కాగలదని అనుకుంటున్నారని చెల్లడించారు.

పరిశోధన అభివృద్ధి సంస్థ యింతవరకు సాగించిన కృషిని ప్రశంసించి, ఉత్పత్తి, తయారీ సంస్థతో ఇది పర్యాటు చేసుకున్న సన్నిహిత అనుబంధాన్ని గురించి శ్రీ పుల్లారెడ్డి ప్రస్తావించారు. మంత్రిత్వశాఖకు త్రివిధ దళాధిపతులకు మధ్య వర్తిల్లుతున్న సన్నిహిత సామరస్యాలను గూర్చి ముచ్చటించారు.

కొన్ని రకాల కంపెనీల పెట్టుబడి ధనం

మినహాయింపు పరిమితి హెచ్చింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 29

కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వారి ఆర్థిక వ్యవహారశాఖ యీ క్రింది పత్రికా ప్రకటనచేశారు :—

"1949 సంవత్సరపు పెట్టుబడి ఇన్యూల (మినహాయింపు) ఉత్తర్వులలో నిర్ణయించిన మినహాయింపు పరిమితి నూరార్పాలన్న ఆలోచన కొంత కాలంగా ప్రభుత్వానికి ఉంది. ప్రస్తుత పరిమితి నిర్ణయించిన తరువాత ధరలు పెరగడం జరిగింది. ఇంతేకాక, చిన్నతరహా, మధ్యరకం పరిశ్రమలకైనా కూడా పెట్టుబడి రు. 5 లక్షలకు పైగానే ఉంటూ ఉంది. కాబట్టి, ఇప్పటి రు. 5 లక్షల మినహాయింపు పరిమితి రు. 10 లక్షలకు హెచ్చాలని నిర్ణయించారు. ఇప్పటివలెనే యీ పరిమితి బ్యాంకింగు, ఇన్సూరెన్సు కంపెనీలకుగాని, కంపెనీలుగా ఇన్‌కార్పొరేట్ అయిన ప్రావిడెంట్ ఫండ్సు వారుగాని కాక తక్కిన పెట్టుబడి ఇన్యూల అన్నిటికి వర్తిస్తుంది. ప్రమాణపూర్వక వాటా మొత్తాలు మరియు పెట్టుబడి ఇన్యూలలో ఇన్యూ అయ్యే బాకీనున్న వాటాలకి యీ మినహాయింపు వర్తించదు. ఈ విషయంలో, పెట్టుబడి పెట్టిన ముస్మా ఎంతైనప్పటికీ కూడా, ఇప్పటి వరకే పెట్టుబడి ఇన్యూల (కంట్రోలు) చట్టం, 1947, క్రింద ప్రభుత్వానుమతి తీసుకోవాల్సి వుంటుంది.

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukaramjahi Road, Hyderabad.

ఆహార పరిస్థితిపై రాజ్యసభ చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 31

దేశంలో ఆహార పరిస్థితిపై నేడు నేడు రాజ్యసభ చర్చ జరిపినది.

చర్చను కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్ గుప్త ప్రారంభించారు.

ఆహార సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు అవసరమని పెక్కుమంది సభ్యులు సూచించారు.

ప్రభుత్వ పరంగా వ్యాపారం సత్ఫలితాలను ఇవ్వటంలేదని కాంగ్రెస్ సభ్యుడు శ్రీ ఎమ్.సి. షా విమర్శించారు.

రైతులకు సరసమైన ధరలకు ఎరువులు దొరకటంలేదని శ్రీమతియశోదా రెడ్డి (కాంగ్రెస్) అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేక ఆహార మండలంగా ఏర్పాటు చేస్తే ఇతర రాష్ట్రాలకు ఆ రాష్ట్రం బియ్యాన్ని ఎగుమతి చేయగలదని ఆమె అన్నారు.

గత 12 సంవత్సరాలుగా ఎంతోమంది ఆహార మంత్రులు సమస్యను పరిష్కరించలేక పోయారని శ్రీ మాకినేని బసవ పున్నయ్య (కమ్యూనిస్టు) విమర్శించారు.

న్యూఢిల్లీ, ఆగస్టు 29

కేరళ స్థానికాధికారుల చట్టాల (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించిన ప్రకారంరాజ్య సభ నేడుఆమోదించినది.



రాష్ట్రమంత్రి పంజాబ్ పర్యటన

చిన్నతరహా పరిశ్రమలను పరిశీలించటానికి

హైదరాబాద్, ఆగస్టు 31

పంజాబ్‌లో చిన్నతరహా పరిశ్రమలు ఏవిధంగా నడుపబడుతున్నదీ పరిశీలించటానికిగాను రాష్ట్ర మంత్రి శ్రీ [illegible] గారి భగవంతరావుగారు సెప్టెంబర్ 17వ తేదీనుంచి 10 రోజులపాటు పంజాబ్ రాష్ట్రంలో పర్యటించటానికి కార్యక్రమం నిర్ణయించుకొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల్లో పంజాబ్ రాష్ట్రానిది అగ్రస్థానం అని విలేఖరులతో ఆయన అన్నారు.

టిబెట్ కాంధీశీకులు చైనా వైఖరిపై రాజ్యసభలో ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31

భారత ప్రభుత్వం ఆశ్రయం కోసం ఇక్కడకు వచ్చిన టిబెటన్ కాందిశీకులను తిరిగి పంపవలసిందిగా కమ్యూనిస్టు చైనా విజ్ఞప్తి చేసినదా అని నేడు రాజ్యసభలో ఒక సభ్యుడు విదేశాంగ వ్యవహారాల మంత్రిని ప్రశ్నించారు.

భారత ప్రభుత్వానికి అట్టి సమాచారమేమీ తెలియదని ఉపమంత్రిణి శ్రీమతి లక్ష్మీ మీనన్ సమాధానమిచ్చారు. చైనీస్ ప్రభుత్వం తమను ఈ విషయమై ఏమీ కోరలేదని ఆమె అన్నారు.

శ్రీ నవాబ్ సింగ్ చౌహాన్ పై ప్రశ్న వేసారు.

నల్లగొండ జిల్లాలో కమ్యూనిటీ రేడియోలు

హైదరాబాద్, ఆగస్టు 31

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రింద నల్లగొండ జిల్లాలో వచ్చే సంవత్సరం నూరు కమ్యూనిటీ రేడియోలు ఏర్పాటు చేయబడగలవని రేడియోలసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ నరసింహం తెలియజేసారు.

నల్లగొండ జిల్లాకు చెందిన అనేక గ్రామాలలో రేడియోలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెల్లడించారు.

కమ్యూనిటీ రేడియోను ఏర్పాటు చేసే గ్రామంలో ఖరీదు క్రింద 175 రూపాయలు, వాడకం ఖర్చు క్రింద నూరు రూపాయలు చెల్లించవలసి ఉంటుంది.

రాజ్యసభలో నెహ్రూ ప్రకటన

(1వ పేజీ తరువాయి)

పెడబొబ్బలు పాగించరు. ఓర్పుతో వ్యవహరిస్తారు. సంప్రదింపుల ద్వారా విషయాలను పరిష్కరించుకోవటానికి ప్రయత్నిస్తారు. అదే సమయంలో ఒక వేళ దాడి జరిగితే దాన్ని ప్రతిఘటిస్తారు. ఎందు వల్లనంటే సరిహద్దులలో ఉన్న పెద్ద పెద్ద పర్వతాలలో ఒక మైలు, లేక రెండు మైళ్ళు ఎవరికిపోయినా భారత దేశానికిగాని, చైనా వారికిగాని భౌతికంగా వచ్చే పెద్దనష్టం ఏమీ ఉండదు. ఒక ఒడంబడికను భగ్నం చేయటంగాని, లేదా దురాక్రమణ పైఖరిని అవలంబించేటం వల్లగాని వచ్చే ప్రమాదం ఏమీలేదు. కాబట్టి ఇటువంటి సందర్భాలలో మనం స్వాంతంత్ర్యవిధానాన్ని అవలంబించాలి. (1) సరిహద్దులరక్షణ, (2) సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారం."

దురాక్రమణ వివరాలు

దీనికిముందు శ్రీ నెహ్రూ 'నేఫా' ప్రాంతంలో చైనా దురాక్రమణకు సంబంధించిన వివరాలను సభవారికి తెలియజేశారు. చైనా ప్రభుత్వం పంపిన లేఖలో తమ సరిహద్దు సైనికులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపారని పేర్కొనబడినట్టు శ్రీ నెహ్రూ అన్నారు. ఒక భారత సైనికుని మృత కళేబరం తమకి దొరికినట్టు కూడా వారు ఆ లేఖలో పేర్కొన్నారట.

అస్సామ్ రైఫిల్ దళాల వారిలో కొందరు చనిపోయినట్టు తెలియవచ్చిన వార్త నిజమేనా అని శ్రీ దివాన్ చమన్ లాల్ ప్రశ్నించగా శ్రీ నెహ్రూ ఇలా అన్నారు:

"దానికి సంబంధించిన వివరాలేమీ తెలియవు. మొత్తంమీద నేఫా ప్రాంతం దగ్గర ఏంజరిగినదీ ప్రభుత్వానికి త్వరగానే సమాచారం అందినది. సభ్యుడు పేర్కొన్న వార్తలు సరియైనవి కావని నా ఊహ."

"ద్వంద్వ విధానాన్ని" గూర్చి శ్రీ నెహ్రూ కొంత సేపు మాట్లాడిన తరువాత శ్రీ [illegible] సి. సజ్జనా వ్యంగ్యంగా ఇలా ప్రశ్నించారు:

"అయితే ఈ దురాక్రమణలు స్నేహపూర్వకంగా జరిగిన చర్యలని అంటారా?"

"శ్రీ నెహ్రూ: పైపై ఆధారాలను బట్టి చూస్తే అవి మరీ అంత స్నేహపూర్వక చర్యలుగా కనపడవు"

దివాన్ చమన్ లాల్: నేఫా ప్రాంతంలో, ప్రత్యేకించి ఈ సమయంలో చైనావారు ఇటువంటి దురాక్రమణ చర్యలు తలపెట్టటానికి కారణాలు ఏమిటో సూచించటానికి అవకాశం ఉన్నదా?

శ్రీ నెహ్రూ: కారణాలు ఏమిటో ఊహించి చెప్పాలి. మొదట ఒక విషయాన్ని స్పష్టం చేస్తాను. లడక్ ఈశాన్య ప్రాంతంలో (చైనా వారు అక్కడ రోడ్డు నిర్మించినట్టు చెప్పబడుతున్నది) ఏర్పడ్డ పరిస్థితికి, నేఫా ప్రాంతంలోని పరిస్థితికీ వ్యత్యాసం ఉన్నది. నేఫాలోని ఈ సరిహద్దు ప్రాంతాలన్నీ మక్‌మోహన్ రేఖలో భాగాలు. మక్‌మోహన్ రేఖను మేము అంగీకరించినట్టయితే బర్మా నుంచి చాలా భారతదేశానికి ఉన్న సరిహద్దు సంతకం చేయవలసి వస్తుంది. అయితే లడక్ సరిహద్దు విషయంలో ఇది వర్తించదు. ఎన్నో ఏళ్లనుంచి అది జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో భాగం ఉంటున్నది. అక్కడ ఏంజరుగుతోందో నిజమైన సమాచారం ఎవరికీ తెలియదు. 100 సంవత్సరాల క్రితం బ్రిటిష్ అధికారులు కొందరు అక్కడికి వెళ్లి ఆ సరిహద్దు రేఖ గీశారు. చైనావారు దాన్ని అంగీకరించలేదు. అది ఆలోచించవలసిన విషయం. మక్‌మోహన్ సరిహద్దు విషయంలో పైమాటలు వచ్చేటప్పుడు జరిగినది ముమ్మాటికీ దురాక్రమణ. చైనావారు అలా ఎందుకు చేశారో నేను ఊహించలేకపోతున్నాను.

శ్రీమతి యశోదా రెడ్డి: సరిహద్దుల్లో పొరపాటేనా అది ఏదో అపోహను బట్టి జరిగిందే గాని, స్నేహపూర్వకంగా జరిగిన చర్యకాదని భారత కమ్యూనిస్టు పార్టీవారు ఒక ప్రకటనలో అన్నారు. దానిపై ప్రధాని అభిప్రాయం ఏమిటో రాష్ట్రపతి ఎజండాలోని తర్వాత విషయాన్ని ఎత్తుకోవటం వల్ల శ్రీ నెహ్రూ దానికి సమాధానం ఇవ్వలేదు.

దీనికి ముందు శ్రీ నెహ్రూ నేఫా ప్రాంతంలో జరిగిన దురాక్రమణ విషయాలను తెలియజేస్తున్న సమయంలో భారత సైనికులు తమ భూభాగంలో ప్రవేశించి (ఫ్లాగిటుస్ ప్రకారంగా) రమ కావలా సైనికులపై కాల్పులు జరిపినట్టు ఆరోపిస్తూ చైనా ప్రభుత్వం భారత ప్రభుత్వానికి నిరసన తెలియచేసినదని అన్నారు. ఆత్మరక్షణార్థం చైనా సైనికులు తిరిగి కాల్పులు జరుపవలసి వచ్చిందని ఆ లేఖలో పేర్కొనబడినదట.

నగరంలో నేడు

సాయంత్రం 6-30 గంటలకు వై.ఎమ్.సి.ఏ. హాలులో (హైదరాబాద్) శ్రీ పి. వి. యస్. రావు (యు.ఎస్. ఐ.ఎస్.) "అమెరికాలో మత వ్యవహారాలు" అనే విషయంపై ప్రసంగిస్తారు.

ఆయుధ సామగ్రి కొనుగోలుపై విమర్శ

నివేదిక సమర్పణలో జాప్యం: లోక్‌సభలో ప్రశ్నలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31

1952 వ సంవత్సరంలో ఒక యూరోపియన్ సంస్థ నుంచి మందు గుండు సామగ్రిని కొనుగోలు చేసిన వ్యవహారంపై విచారణ కమిటీ నివేదికను సమర్పించటంలో ఆలస్యాన్ని గూర్చి నేడు లోక్‌సభలో సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు.

శ్రీ రామకృష్ణగుప్త, మరికొందరు అడిగిన ప్రశ్నకు సమాధానంలో కమిటీ ఇంకా నివేదికను సమర్పించలేదని రక్షణ ఉప మంత్రి సర్దార్ ఎస్.ఎస్. మజీతియా వెల్లడించారు. కమిటీ అధ్యక్షుడైన న్యాయశాఖ ఉప మంత్రి శ్రీ హాజర్నలిస్ అనారోగ్యం కారణంగా నివేదిక సమర్పణ ఆలస్యమైనదని రక్షణ ఉప మంత్రి వివరించారు.

డాక్టర్ రామ్‌సుభాగ్ సింగ్: ఈ వ్యవహారం ఎప్పుడో 1952 వసంవత్సరంలో జరిగింది. రక్షణ శాఖ వ్యవహారాల్లో ఇది మొదటిది కాదు. మరి ఇంత ఆలస్యం ఎందుకైనదీ? సర్దార్ మజీతియా: మంత్రిత్వ శాఖకు సభ్యుల ఆరోగ్యంపై అధికారం లేదండీ! అందువల్ల వారిని బలవంతం చేయలేము.

డాక్టర్ సుభాగ్ సింగ్: మరి అయితే కాస్త ఆరోగ్యవంతుడైన ఇంకొకరిని ఎందుకు నియమించరు? స్పీకర్ శ్రీ అయ్యంగార్: 40 కోట్ల మంది జనాభాలో ఇంకొక సభ్యుడే దొరకలేదా?

రక్షణ మంత్రి శ్రీ కృష్ణమేనన్ ఇలా అన్నారు:

"ప్రభుత్వం మొదట ఒక కమిటీని నియమించినది. అయితే ఆ కమిటీ ఏకగ్రీవ నివేదికను సమర్పించలేకపోయింది. మరొక కమిటీని వెయ్యాలని నిశ్చయించటం జరిగింది. మొదటి కమిటీ నివేదికలో మెజారిటీ అభిప్రాయం సంతృప్తికరంగాలేదు అందులో కొన్ని సందేహాలు ఉన్నాయి."

వార్త ఖండన

లండన్, ఆగస్టు 31

బ్రిటన్‌లో భారత రాయబారిగా వ్యవహరిస్తున్న శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేనిమిత్తం రేపు విమానంలో బయలుదేరి ఢిల్లీ వెడతారన్న వార్త నిజంకాదని భారత రాయబారి కార్యాలయం ప్రతినిధి ఒకరు నేడు ప్రకటించారు.

టిబెట్‌లో ఘాతుక చర్యలు

(1వ పేజీ తరువాయి)

టిబెట్ సమస్యను చర్చకు పెట్టాలని దలైలామా ప్రధాని నెహ్రూను కోరవచ్చునని టిబెట్ వర్గాల వారు అన్నారు. భారత దేశం నుంచి ప్రవాస ప్రభుత్వంగా వ్యవహరిస్తున్న టిబెట్ ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వం గుర్తించకపోయినప్పటికీ, దలైలామా ప్రభుత్వం టిబెట్‌కు, టిబెట్ ప్రజలకు సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తున్నదనటం అక్షరాలా నిజం.

దలైలామా ఇండియాకు పారిపోయి వచ్చిన తర్వాత అతని తరపున వ్యవహరిస్తున్న పంచన్ లామా ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్నాడని పిగట్సే నుంచి వచ్చిన ఒక వార్త తెల్పుతున్నది.

చౌక దుకాణాలు

(1వ పేజీ తరువాయి)

ణాలలో బియ్యం దొరుకుతాయి. కుటుంబ సభ్యులు ఎంత మంది అనే విషయాన్ని నియోజక వర్గానికి చెందిన కార్పొరేషన్ సభ్యుడు నిర్ధారించవలసి ఉంటుంది.

రూపాయికి రెండుశేర్లవంతున చౌక దుకాణాల్లో బియ్యం అమ్ముతారు.

కమిషనర్ శ్రీ శాస్త్రి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం, ప్రతి దుకాణానికి వారానికి పది టన్నుల బియ్యం సప్లైచేయవలసి ఉంటుంది. సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ బియ్యం సరఫరా చేస్తుంది.

దుకాణాలు కరువు కాలంలోనే ఉంటాయా, లేక సంవత్సరం అంతా నిర్వహించాలా అనేవిషయం నిర్ధారణ కాలేదు.

హైదరాబాద్, ఆగస్టు 31

పాటియాలాలో ఇటీవల ఇండియన్ హాకీ అసోసియేషన్ ఆమోదించిన నియమావళికి అనుగుణంగా హైదరాబాద్ హాకీ అసోసియేషన్ తన నియమావళిని మార్చుకొన్నది.

లోక్‌సభలో సోషలిస్ట్ సభ్యునికి స్పీకర్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 31

తన ఉత్తర్వును ఆక్షేపణ తెలియజేయటానికి ప్రయత్నించిన సోషలిస్ట్ సభ్యుడు శ్రీ బ్రిజ్ రాజ్ సింగ్‌ను నేడు లోక్‌సభలో స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్ చర్య తీసుకొనగలనని హెచ్చరించారు.

ఆక్షేపించటానికి ప్రయత్నాన్ని కొనసాగిస్తే సభాధిక్కరణనే కాన్ని, స్పీకర్ అధికారం ధిక్కరించిన నేరాన్ని మోపగలనని ఆయన హెచ్చరించారు.

గత 29 వ తేదీన తనను సభ నుంచి బహిష్కరించి నందుకుగాను శ్రీ సింగ్ ఆక్షేపణ తెలియ జేయటానికి ప్రయత్నించారు.

పొరపాటును సరిదిద్దుకొనే వరకు రోజూ ఐదు నిమిషాలసేపు సభ నుంచి నిష్క్రమించగలనని శ్రీ సింగ్ అన్నారు.

దేశంలో మలేరియా వ్యాధి నిర్మూలన

అమెరికా ఆర్థిక సహాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 31

అమెరికా భారత ప్రభుత్వానికి మరి 8 కోట్ల రూపాయల ధన సహాయం చేసినది.

అమెరికా సాంకేతిక సహకార సంస్థ భారత ప్రభుత్వ ప్రతినిధుల మధ్య నేడీ విషయమై ఒక ఒప్పందం జరిగినది.

మలేరియా నివారణ కార్యక్రమాల కోసం ఇవ్వబడిన ఈ ధనంతో పరికరాలు, డి. డి. టి. మొదలైనవి కొనటం, సిబ్బందికి జీతాలివ్వటం జరుగుతుంది.

ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన మలేరియా నివారణ పథకాలకు ఇంతవరకు అమెరికా 23.7 కోట్ల రూపాయలను మంజూరు చేసినది.

ప్లాజా (PLAZA) — ఫోన్ : 6555

సికింద్రాబాద్

నేటి నుంచి

హారీ బ్లాక్ అండ్ ది టైగర్

కలర్స్ కలర్ — సినిమాస్కోప్

నటీనటులు : స్టీవర్ట్ గ్రాంజర్, బార్బరాటమ్, ఐ.ఎస్.జోహార్

శుక్రవారం, 4-9-59 తేదీన మధ్యాహ్నం 3-30 గంటలకు విడుదల!

సాహస కృత్యాలతో వినోదాన్నిచ్చే ప్రణయరస చిత్రం

ముకుల్ పిక్చర్స్ సమర్పించు

ఆర్. ఎల్. సూరి వారి

బాజీగర్

నటీనటులు: నిరూపరాయ్, జై రాజ్, పాలెన్, తివారీ, నాజ్, పద్మిని, మజ్నూ, సుందర్

దర్శకత్వం: నానాభాయ్ భట్ సంగీతం: చిత్రగుప్త

అశోక్ - హైదరాబాద్ మనోహర్ - సికింద్రాబాద్

(Trupix)

శుక్రవారం, సెప్టెంబరు 4వ తేదీన బ్రహ్మాండమైన విడుదల!

రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి

శభాష్ రాముడు

★

—ఒకేసారి విడుదల—

సాగర్ హైదరాబాద్

అలంకార్ సికింద్రాబాద్

మార్కండేయ వరంగల్

రమేష్ నిజామాబాద్

(Nima) — రాజశ్రీ రిలీజ్ —